శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

"సాయివంటి దైవంబు లేడోయి.. లేడోయి"

అంటూ



# కృప

విజయదశమి సంచిక

శ్రీబాబూజీ ఆచరించి, ప్రబోధించిన బాబా అనుగ్రహ శుభమార్గం సాయిపథం...

సాయి అంటే ఆనందం, పథం అంటే మార్గం. అందుకే సాయిపథం ఆనంద మార్గం.

బాబా యొక్క పథం *Happiness through Happiness*... ఆనంద జీవనం సాయిపథం ....

నడిచే మార్గమూ ఆనందమే... పొందేదీ ఆనందమే... గమ్యమూ ఆనందమే...

ఎవరైతే నిరంతరం ఆనందంగా ఉంటారో వారు సాయిపథంలో ఉన్నారు. అంటారు శ్రీబాబూజీ.

## సాయిపథం అంటే సద్గురుపథం



ఇది బ్రాహ్మణ (బ్రహ్మజ్ఞానం కలిగినవారు) మసీదు. ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన నడిపించి, చివరికంటా గమ్యం చేరుస్తారు" అని అభయమిచ్చారు *శ్రీసాయిబాబా.*

అడిగింది ఇవ్వడం సాయిశపథం...ఆ అడగడం నేర్పడం సాయిపథం... *-శ్రీబాబూజీ*

శ్రీబాబూజీ ఆచరించి ప్రభోధించిన బాబా అనుగ్రహ శుభ్రమార్గం సాయిపథం.

శ్రీబాబూజీ మాటల్లో సాయిపథం అంటే శ్రీసాయిబాబా చూపిన మార్గం. బాబా నడిచిన బాట. సాయి అనే గమ్యానికి రహదారి (రాచబాట). ఏ ఒక్క మత సాంప్రదాయానికీ చెందక, ప్రపంచంలోని అందరు మహాత్ములు ఆచరించి బోధించిన విశ్వజనీన ఆధ్యాత్మిక సాంప్రదాయమే ఈ సాయిమార్గం. మరో మాటలో "సాయిపథం అంటే సద్గురుపథం". సాయిపథానికి సాయియే ఆధారం, జీవం, మార్గం, గమ్యం, సర్వం. శ్రీసాయిభక్తులకు శ్రీసాయినాథుడే దైవం, సాధన, మార్గం, గమ్యం. బాబాను కేంద్రంగా చేసుకొని అల్లుకొన్న జీవన విధానం సాయిపథం. శ్రీబాబూజీ మానసం నుండి ఉద్భవించి, భక్తిరసగంగగా ఉప్పొంగిన ఆనందపథం సాయిపథం.

"ప్రతి వ్యక్తికి లక్ష్యం ఉండాలి. మన లక్ష్యం, గమ్యం ఎంత ఉన్నతమైనదో, పవిత్రమైనదో వాటిని చేరే మార్గం అంతే పవిత్రంగా ఉన్నతంగా ఉండాలి" అంటారు శ్రీబాబూజీ. అడ్డుత్రోవలో, వక్రమార్గంలో అక్రమంగా ఎలాగైనా సరే త్వరితగతిన లక్ష్యాన్ని చేరాలనే భావనలకు శ్రీబాబూజీ నిర్దేశించిన సాయిపథంలో చోటు లేదు. లక్ష్యాన్ని చేరడం ఒక్కటే ప్రధానం కాదు. "ఆ లక్ష్యాన్ని బాబా చూపిన శుభ్రమార్గంలోనే చేరామా? లేదా? అనేది కూడా ప్రధానం" అంటారు శ్రీబాబూజీ. మనం నిర్దేశించుకున్న గమ్యాన్ని త్వరితగతిన చేరగలిగినా అది బాబా చూపిన శుభ్రమార్గం కానప్పుడు అది నిష్ఫలమే అవుతుంది. ఆ అపవిత్రపు మార్గం, బాబా చేర్చాలనుకున్న గమ్యానికి చేరువ కానీయక, మనమే ఏర్పరచుకున్న అడ్డంకియై, గమ్యానికి మరింత దూరం చేస్తుంది అంటారు శ్రీబాబూజీ. శ్రీబాబూజీ విశిష్ఠ వ్యక్తిత్వానికి, అంతరంగానికి ఈ ప్రబోధమే ఒక ప్రమాణం. ఇదే మన ప్రయాణంలో గమ్యానికి ఎంత చేరువవుతున్నాం అన్నదానికి ప్రమాణం.

**-సాయిదీవెన**

అందుకోవలసిన గమ్యాన్ని మనం అందుకోగలిగిన సామర్థ్యం కంటే ఎప్పుడూ ఒక అడుగు దూరంలోనే పెడతాడు భగవంతుడు. (అందుకే సాయి అన్నది ఆ ఒక్క అడుగు నీవే వేయాలి" అని) ఇక మన ఇహ జీవితంలో నడకలు నేరుస్తున్న బిడ్డను రా!రా! అంటూ అడుగు అడుగు జరుగుతుంటుంది. పారాడుతున్న బిడ్డకు అలానే చేస్తుంది తల్లి. కన్నతల్లైనా, కనిపెట్టుకున్న తల్లైనా అంతే మరి. *- గురుకృప*

సంపుటి : 19
అక్టోబర్ 11

సంచిక : 4
2016



# కృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



లోపలి పేజీలలో

పథగామి 4
– గురుకృప

బాబాకు దగ్గరవ్వాలంటే 16
–శ్రీబాబూజీ

పడిపోకుండా పట్టుకొంటాను! 8
– పార్థసారథి ప్రవచనాలు

హంస 24
–శ్రీ కొండూరి రమాకాంత్

శ్రీబాబూజీ 14
– డా॥ శ్రీనివాసులరెడ్డిగారు

గురుకృపాలహరి 26
– గురుకృప

నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు*
**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.
Web : www.gurukrupa.info



## పథగామి

"నా భక్తుణ్ణి నేనే ఎన్నుకుంటాను, నా భక్తుడు ఎంతదూరాన ఉన్నా-పిచ్చుక కాలికి దారంకట్టి లాక్కొన్నట్లు - రకరకాల మిషల మీద నేనే వారిని నా దగ్గరకు రప్పించుకుంటాను. ఎవరూ వారంతట వారుగా నా దగ్గరకు రారు!" అని స్పష్టం చేసారు శ్రీసాయిబాబా. ఇంత స్పష్టంగా మనకు బాబా చెప్పినా ఈ విషయాన్ని మరచి మనమందరం ఇన్నిసార్లు శిరిడీ వెళ్ళామని అంటుంటాం.

ప్రదక్షిణలు చేయడం, పారాయణలు చేయడం, నామజపాలు చేయడం, దర్శనాలు చేసుకోవడం, ధునిలో టెంకాయలు వేయడం వంటివన్నీ చేసి ఇవతలకు వచ్చిన తరువాత ఆలోచన, మాట, చేత ఈ మూడింటిని మూడు వేరు వేరు అడ్డదారుల్లో నడిపిస్తూ, అలా నడిస్తేనే ఈ లోకంలో మనుగడ అంటూ ఆ లౌక్యం లేకపోతే ఎలా మసలుకోవడం అంటూ, అలా తమ ఇష్టానుసారం బ్రతకడంలో ఏ అడ్డంకులు రాకూడదని మొక్కులు మ్రొక్కుకోవడమే మార్గంగా, అనుష్ఠానంగా, ఆధ్యాత్మికతగా తలపోస్తున్న సమయంలో మనలను ప్రశ్నిస్తూ ఇలా అన్నారు- "ఎందుకు ఈ జీవితంలోకి వచ్చింది? పిడకలు ఏరుకోవడానికా? సద్గురువుని తెలుసుకో" అంటూ తానే ఆ ప్రశ్నకు సమాధానం చెబుతున్నారు శ్రీసాయి. మనం గురువుని చేరుకోగలిగాం ఆయన అనుగ్రహంతో. అనుగ్రహం అంటే వారు నిన్ను తమ వారిగా గ్రహించడమే. ఆయన బిడ్డగా గ్రహించడమే అనుగ్రహం అంటారు. అలా గ్రహించిన తండ్రి... 'తండ్రికి తగ్గ బిడ్డలా మసలుకోమంటున్నారు మనల్ని'. అందుకు మనం వారి గురించి తెలుసుకోవాలి. అది మనం వేయవలసిన ఒకే ఒక చిన్న అడుగు. ఈ అడుగు వేయడానికి కావలసిన ఆదరువు, ఆలంబనగా మనకు అందించిన ఉపకరణాలు సత్సంగం, పారాయణ, నామజపం, దర్శనాలు, ఈ ఉపకరణాల అంతరార్థాన్ని ఎరుక పరిచారు. అలా మనం వాటిని ఉపయోగించుకోవడం వలన కలిగిన అవగాహనను ఆకళింపు చేసుకొని, అనుగుణంగా వర్తిస్తే ఆయనకు తగ్గ బిడ్డలమవుతాం.

గురువుగారు చెప్పిన రీతులలో మనం ఉపకరణాలను ఉపయోగించుకోనప్పుడు నిత్యజీవితంలో ఎన్నో అడ్డుగోడలు పెరిగి మనల్ని గురువుకి దగ్గర కానివ్వడం లేదు. ఆ అడ్డుల్ని నీవే తొలగించాలని అన్నారు శ్రీసాయి. గురువుకి దగ్గరవ్వాలంటే మన ప్రథమ కర్తవ్యం గురువుపై ప్రేమ, భక్తి విశ్వాసాలు నింపుకొని, గురుతత్త్వాన్ని, గురుపథాన్ని తెలుసుకొని మసలుకోవడమే. జీవితాన్ని ప్రేమించడం, జీవించడం, ప్రతిక్షణాన్ని అర్థవంతంగా ఆస్వాదించడం, అనుభవించడం, ఆనందించడం, మనుగడ సాగించడమే జీవించడం. "ఆధ్యాత్మికతను రెండు మాటల్లో వర్ణించాలంటే ప్రేమను పొందడం, ప్రేమను



పంచడం" అని అందుకే అన్నారు శ్రీబాబూజీ.

ఈ రోజు నేను పూజ చేసాను, పారాయణ చేసాను, నామజపం చేసాను, సత్సంగానికి వెళ్ళాను, ఏం తెలుసుకున్నాను? ఏం ఆచరించాను? ఏం నేర్చుకున్నాను? ఏం ఉపయోగపెట్టుకున్నాను? అనే ప్రశ్న వేసుకోవడం లేదు.

పోనీ, ఈ ప్రశ్నించుకునే నైజం మనకు లేదా అంటే మన నిత్య జీవనంలో అలా ప్రశ్నించకుండా లేము. మన పిల్లవాడు స్కూలు నుండి రాగానే ఏం చెప్పారు? ఏం నేర్చుకున్నావు? అని అడుగుతున్నాం. 'ఎ' అనో, 'బి' అనో, 'యాంట్' అనో, 'బ్యాట్' అనో, 'క్యాట్' అనో చెప్పగానే ముద్దులిస్తున్నాం. చప్పట్లు కొడుతున్నాం, ఉత్సాహపరుస్తున్నాం, బహుమతులిస్తున్నాం, అక్కున చేర్చుకుంటున్నాం. ఇదంతా మన అనుభవమే. ఈ అనుభవాన్ని అంటిపెట్టుకున్నట్లయితే, మన తండ్రి అయిన బాబా దగ్గర ఇవన్నీ ఆలోచిస్తున్నామా? అలా కాదంటే 'ఆ' అనుభవాన్ని అంటిపెట్టుకున్న వాళ్లమెలా అవుతాం?

యుక్తవయస్సు వచ్చిన పిల్లవాడు పరీక్ష వ్రాసి వచ్చాక ఎలా వ్రాశావు? ఎన్ని మార్కులొస్తాయి? అని అడుగుతున్నామేగాని, ఆ చదువుకున్న, తెలుసుకున్న శాస్త్ర విషయాల్ని జీవితంలో ఆహారపు అలవాట్లలోగాని, జీవన విధానంలోగాని ఉపయోగ పెట్టుకోలేకపోతున్నా అడగని మనం– మార్కులు తక్కువ వస్తే మాత్రం ఏం, ఎందుకు రాలేదు అంటున్నాం. ఈ విధంగా **మన జీవనశైలిలో ఫలితం గూర్చి తప్ప, అనుభూతుల్ని అంటిపెట్టుకొని, అనుభవంలో జీవనం సాగిస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయన్న విషయాన్ని మరిచాం.** మన మమకారం మనల్ని నీతిని తప్పేట్లు చేస్తున్నది. డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేందుకు వయస్సు పరిమితి 18 సం॥లు అయితే మనం మన పిల్లవాడికి 10 సం॥లకు స్కూటర్ ఇచ్చేస్తున్నాం, లేదా వాడే తీసేసుకుంటున్నాడు. మనం ఇబ్బందిపడుతూ, తోటి వారిని, అవతలివారిని ఇబ్బంది పెడుతున్నాం. మన జీవనశైలి క్రమం తప్పి నడుస్తున్నది. వీటిని క్రమబద్ధీకరించబడేది గురుసాన్నిధ్యంలోకి అడుగిడినపుడు అన్నది తెలియాలి. అప్పుడు ఈసారి దర్శనంలో ఏం మార్పు వచ్చింది అన్నది మనం గమనించుకోగలం.

"పెద్దల్ని గౌరవించాలి, గురువుల్ని పూజించాలి" ఇలా అన్నీ వింటూ, పఠిస్తూ, మార్కులు తెచ్చుకునే మన పిల్లలు వాటిని పాటిస్తున్నారా, లేదా అనే ఆలోచనే మరచిపోయాం. ఈ యుగంలో, మన కాలంలో, ఈ తరంలో. అందుకే మనకు ఆధ్యాత్మికత అంటే ఎంత మొక్కాం, ఎంత పొందాం. ఇదే



బేరీజు అయ్యింది. అందుకనే అనుగ్రహం అంటే మన దృష్టి అంతా ఎంత సంపద, ఎన్ని ఇళ్ళు, ఎన్ని కార్లు, ఎంత సుఖం, ఎంత భోగం. వాటిని పొందిన వారికి ఎంతో అనుగ్రహం ఉందనుకుంటున్నాం. మరి బాబా చరిత్రలో మహల్సాపతి, దీక్షిత్, నూల్కర్‌ల జీవితవృత్తాంతాల్ని చదివి, ఎంత అదృష్టవంతులో అనుకుంటామే గాని, ఆ అదృష్టంకదా మనకు కావల్సింది, అది కావాలి అన్నంత అవగాహన కలగడం లేదు అంటే వారి అనుభవం మనం చూడలేకపోవడమే. అందుకే పారాయణ. ఆ పారాయణ ఎలా చేయాలో చెప్పారు గురువుగారు. అలా చేస్తే వారు పొందిన అనుభూతి కొంతైనా పొందగలం అంటారు గురువుగారు. అట్టి అనుభూతి మనల్ని ఆవైపుగా నడిపే దృష్టిని, దృక్పథాన్ని ఇస్తుంది.

కోట్లు కావాలనుకునే మనకు మరో భక్తుడు కనిపిస్తున్నాడు. బాబా సన్నిధిలో కోటీశ్వరుడైన బూటీ... బాబా సాన్నిధ్యాన్ని కోరుకున్నాడు. ఆయన వృత్తాంతం ద్వారా **'సన్నిధే అసలైన పెన్నిధి'** అన్న ఎరుక వస్తున్నది. కాని అది మన హృదయగతం కావడం లేదు. మనం ఈరోజు ఆధ్యాత్మిక సాధనలో ఏం నేర్చుకున్నాం? ఒక చిన్న అడుగు వేయడానికి కావలసిన స్ఫూర్తి కలిగిందా? ఒక్క మిల్లీమీటరు ముందుకు వెళ్ళినా చాలు కదా! దీనికి మనం చేయవలసిందేమిటో అన్నది మహాత్ముల మాటల్లో తెలుసుకుందాం.

**బాబాని నమ్మామా? బాబా నచ్చాడా? ("బాబాని నమ్మమని నేను ఎవరికీ చెప్పను. బాబాను ప్రేమించమని చెబుతాను" అంటారు శ్రీబాబూజీ)** నచ్చినదాన్ని పొందాలనుకుంటాం. సొంతం చేసుకోవాలనుకుంటాం. కనుక బాబాని నమ్మడం కన్నా బాబా నచ్చడం ముఖ్యం. అందుకు బాబా తెలియాలి మనకు.

**భక్తపరాధీనుడు భగవంతుడు అంటున్నది శాస్త్రం.** భగవంతుడి వెంట మనం పడటం కాదు, భగవంతుడు మన వెంట పడేట్లు మనం ఉండాలి అంటారు మరో మహాత్ముడు. లేగదూడ వెంట గోమాత పరిగెతినట్లుగా.

**గురువుని పూజించడం కాదు. గురువుని ఉపయోగపెట్టుకోవాలి అంటారు.** గురువుల్ని పూజించడం మాని, ఉపయోగపెట్టుకోవడం నేర్చుకోవాలి. స్కూలుకి వెళ్ళిన మన పిల్లవాడు టీచర్‌ని పొగిడివస్తే, టీచర్ నామస్మరణ చేసి వస్తే సరిపోతుందా? లేక ఆ టీచర్ తెలుసుకున్న దాన్ని బోధిస్తుంటే దాన్ని



శ్రద్ధతో విని, శ్రద్ధతో ఆచరిస్తేనే కదా ఉపయోగం, ఫలితం. ఇది మరిచాం. గురుసన్నిధికి పోయి ఆయన ఆచరణ ద్వారా బోధిస్తున్న దాన్ని గమనించుకోకుండా భజనలు చేసి వస్తున్నాం. ఆయన నడకద్వారా, నడతద్వారా, మాటల ద్వారా, చూపులద్వారా ప్రతిదానితో అనుక్షణం మనకు బోధిస్తున్నారు. ఆ గమనింపు, ఆ చూడటం, ఉండటం, అనుభూతి చెందడం, అవ్వడమే (Seeing, being, experiencing & becoming) దర్శనం అంటారు శ్రీబాబూజీ. ఏదైనా ఉపయోగపెట్టుకోవాలి అంటే అది మనదై పోవాలి. అది మనమై పోవాలి. మన తనువంతా నిండాలి. తనదై పోవాలి, తనువై పోవాలి, తానైపోవాలి.

**భగవంతుడంటే నీకిష్టమా? భగవంతునికి నీవిష్టమా?** అంతటా అన్నిటా వున్న నన్ను ఎవరైతే గుర్తించి, ఆ గ్రహింపుకనుగుణంగా మసలుకొంటారో వారు నాకు ప్రీతిపాత్రులు అంటారు శ్రీసాయిబాబా. ఇది మరిచిన మనం జీవచ్ఛవాలం. జీవించి మరణించినవాళ్లము. **మరపే మరణం** అంటారు శ్రీబాబూజీ. గురువుల ఫొటోలు పెట్టుకుంటున్నాం, దండలు వేస్తున్నాం, దండాలు పెడుతున్నాం, హారతులిస్తున్నాం, నైవేద్యాలు పెడుతున్నాం, ప్రసాదాలు పంచుతున్నాం. కాని, చెప్పింది చేయడం లేదు. వారు నడిచి చూపిన బాటన నడవడం లేదు మనం.

చేసినా అర్థం తెలుసుకొని, అర్థవంతంగా జీవించడం లేదు. మూసగా మసలుకొంటున్నామే గాని, విశ్లేషణాత్మకంగా, పరిశీలనాత్మకంగా మనల్ని మనం ప్రశ్నించుకోవడం, పరిశీలించుకోవడం లేదు. మన గమనాన్ని గమనించుకోవడం లేదు. ఈ అడుగు నన్ను బాబాకు చేరువ చేస్తుందా? దూరం చేస్తుందా అన్న గమనింపు ఉండాలి మన గమనంలో. ఆయన్ను దర్శించాలంటే వారు చూపిన బాటే మనకు మార్గం. అదే మనల్ని గమ్యంచేర్చునది. అందుకే ఒక మహాత్ముడు ఇలా అంటాడు "చనిపోయిన తరువాత ఏమి అవుతావు అన్నది కాదు, ఈ రోజు ఏమవుతాం అన్నదే ఆధ్యాత్మికతలో ముఖ్యం". ఆధ్యాత్మికతను క్రమపద్ధతితో, నిబద్ధతతో నేర్చుకోకుండా (ఆ దృక్పథం, నేర్చుకోవాలనే దృక్పథం లేకుండా) ఏదో పూజలు, పునస్కారాలు, జపాలతో కాలం గడుపుతున్నాం తప్ప వాటి అసలు అర్థాన్ని, ఆంతర్యాన్ని గ్రహించకపోవడం వలన కావలసిన, పొందవలసిన ఫలాలను పొందలేకపోతున్నాం. ఇలా ఆధ్యాత్మిక పదాల వాడుకలో మనకుండే భావ దారిద్ర్యాన్ని పోగొట్టి, దృక్పథాన్ని సంస్కరించి మనల్ని భావ సుసంపనులుగా చేస్తున్నారు మన గురుదేవులు

*–గురుకృప*



**మన(సు)ల్ని మనం ఎంత ఖాళీ చేసుకుంటే భగవంతుడు అంతగా మనలో ప్రవేశిస్తాడు.**



## పడిపోకుండా పట్టుకొంటాను!

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా!
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః

"దేవదేవుడు సృష్టిగా దిగి వస్తున్నాడు. ఈ సృష్టిగా వర్ధిల్లుతున్నది అతడే! పరిపూర్ణమయిన సేవను ఈ సృష్టిరూపంలో ఉన్న అతనికి మనం నిర్వహించిన వేళ అతడి నిజస్వరూపాన్ని ఇక్కడే, ఈ భూమిపైననే, ఇప్పటికిప్పుడే మనం అనుభవించవచ్చు. అలా అతడిని అనుభవించాలన్న ప్రయత్నం మనలో సాగుతున్నవేళ, ఆ అనుభూతి మనకు అందుతున్నవేళ ఏ కారణం చేతనయినా మనం ఏమరుపాటుకు గురైనప్పుడు అతడు మనను విడిచిపెట్టడు. తత్త్వదర్శనం కలిగిన జ్ఞానుల రూపంలో మనకు దగ్గరై మనను మేలుకొలిపి మరల మరల మనకు తనతో అనుసంధానాన్ని అనుగ్రహిస్తూ ఉంటాడు. అంతవరకు పొందిన అనుభూతిని కొనసాగేటట్లుగా చేస్తూ కరుణ చూపుతాడు.

"నాతో ఒక్కసారి శ్రుతి కలిపినవానిని, అటుపైన ఆ స్మృతి నుండి జారుతున్నప్పటికీ నేను వదిలిపెట్టను, ఉపేక్ష చేయను. తగిన నామ రూపాలతో దగ్గరై, మరల అక్కున చేర్చుకొంటాను" అని అతడు అభయవచనాన్ని పలుకుతున్నాడు. ***(ఒకసారి చేయిపట్టుకున్నాక- చివరికంటా గమ్యం చేర్చేవరకు వదిలిపెట్టను అన్నారు శ్రీసాయిబాబా).***

సృష్టిగతమయిన దేవదేవుడు నామరూపాలకు మాటున ఉన్నాడు. నామరూపాలకు చాటున ఉన్నాడు. విభిన్నమయిన నామరూపాలను ధరిస్తూ, ఎనలేని వైవిధ్యాన్ని చూపుతున్నాడు. ఒకలా చూస్తే ఈ నామరూపాలు అతడిని మనం చూడటానికి అడ్డంకి! ఒకలా చేస్తే ఈ నామరూపాలు అతడు మనకు చూపుతున్న విశిష్టమైన అనుభవాలు! ఒక్కసారిగా ఇన్ని నామరూపాలలో ఇంత సృష్టిగా వ్యక్తమవటం మరి విశిష్టత కదా!

ఏది ఏమయినా ఈ నామరూపాల మీదుగా అతడిని మనం చూడగలగాలి! ఈ నామరూపాలకు అతీతంగా వ్యక్తమవుతున్న అతడిని మనం అనుభవించగలగాలి! అందుకుగాను మనం ప్రణిపాతం చెందాలి! పరిపూర్ణమయిన శరణాగతి చెందాలి! ఈ నామరూపాలు అతడివి అని మనకు తెలుసు కనుక ఈ నామరూపాలు ధరిస్తున్న అతడికి శరణాగతి చెందాలి! ఈ శరణాగతి మొదట విధేయతగా



ప్రారంభమై, పరిపూర్ణమయిన సమర్పణగా పర్యవసిస్తుంది. **విధేయతకు పరాకాష్ఠస్థితియే శరణాగతి!** అట్టి శరణాగతికి అతడు ముచ్చటపడి మనకు ప్రసన్నుడవుతాడు.

అలా అతడు ప్రసన్నుడవుతున్న వేళలో మనం పరిప్రశ్నం చేయాలి! ఎంతవరకు వెళితే ప్రశ్నించడానికి ఇక అవకాశముండదో అంతవరకూ ప్రశ్నిస్తూ సాగడం పరిప్రశ్నమవుతుంది. సర్వసాధారణంగా మనం 'ఉపరి'ప్రశ్నలు వేస్తూ ఉంటాం. ఉపరిప్రశ్నలు అంటే పైపైన ప్రశ్నలు. మీరెవరు? ఏం చేస్తుంటారు? ఎక్కడ ఉంటారు? ఏ పనిమీద వచ్చారు? మీది ఏ కులం? ఏ మతం? మీ ఆస్తిపాస్తులెంత? ఎంతమంది పిల్లలు? ఏం చేస్తున్నారు? పెళ్ళిళ్ళు అయినాయా? పిల్లలా? పేర్లేం పెట్టారు? చదువుకొంటున్నారా? ఎక్కడెక్కడున్నారు? ఇలాంటివన్నీ ఉపరిప్రశ్నలే! ఎదుటివారిని గూర్చి పైపైన తెలుసుకోవడానికి మాత్రమే పనికివస్తాయి. ఇక రెండవది **ఉభయ కుశలోపరి** ప్రశ్నలు. మీరు క్షేమము కదా! పిల్లలు క్షేమమే కదా! పంటలు చేతికి వచ్చాయి కదా! ఇటువైపు ఎప్పుడు వస్తున్నారు? ఈ యోగక్షేమాలు కనుక్కోవడమంటే, ఇవి ఉభయకుశలోపరి ప్రశ్నలు. ఇక్కడ ఉభయుల కుశలము అడిగి చెప్పుకొని వదిలేస్తున్నాము. ఇక్కడ కూడా అంతకుమించి లోతుకు పోవడం లేదు.

ఇక పరిప్రశ్న దగ్గరకు వద్దాం. ఎదుట నున్న వ్యక్తి యొక్క పేరు, ఊరు మొదలయినవి పుట్టిన తరువాత మరి. పుట్టక ముందు? గర్భస్థుడై ఉన్నప్పుడు? గర్భస్థుడు కాకముందు? ఇంకా అంతకుముందు! అప్పుడు అక్కడిదాకా వెళ్లినపుడు అది పరిప్రశ్న అవుతుంది. ఆ స్థితిలో అతడు దేవుదేవుడేనని మనకు స్పష్టమవుతుంది. ప్రణిపాతము చెందిన తరువాత అనగా శరణాగతి చెందిన తరువాత అతని నిజస్వరూపం మనకు స్పష్టమయ్యేంతవరకు పరిప్రశ్నసాగాలి! అప్పుడు నామరూపాత్మక మరియు దేవాలయాలలో ప్రజ్ఞారూపుడయిన దైవం ఎలా వెలుగొందుతున్నదీ మనకు దర్శనమిస్తుంది. ఇక మనకా దర్శనం అనుభవం కావాలి. **"దేవాలయంలో దైవాన్ని దర్శించడం కాదు. దేవాలయం ద్వారా దైవాన్ని దర్శించాలి".**

దివ్యమయిన ఆ దర్శనం మనకు అనుభవం కావాలి అంటే అతడిని మనం సేవించాలి. అది పరిచర్య రూపంలో సాగాలి. సేవ అంటే ఏమిటి? నామరూపాలతో అతడు ఉన్నస్థితిలో అతడికి కావలసినదేమిటో అందించగలగడం. అక్కడున్న ఆవశ్యకతను విచక్షణతో గమనించి,



ప్రవర్తించగలగడం! ఎప్పటికి ఏది అవసరమో అప్పటికి అలా సహకరించగలగడం! ఇదీ సేవ అంటే! ఇలాంటి సేవలో ప్రజ్ఞారూపుడై వెలుగుతున్న అతడు మన హృదయం దాకా సాగివస్తాడు. మనను స్పృశిస్తాడు. మనతో శ్రుతి కలుపుతాడు. మనకు తనతో తాదాత్మ్యస్థితిని అనుగ్రహిస్తాడు. సేవ సాగుతున్నవేళ మన దేహాలు ఉపకరణాలుగా నిలుస్తాయి. అంతా తన్మయమై అతని మయమై భాసిస్తుంది. అప్పుడు దేహాలు కూడా వేరుగా అనిపించవు. అవీ అతడి రూపాలే! అతడు తానుగా అల్లుకొన్నవే! ఇలా దగ్గరై, సేవా రూపంలో పరవశించడానికిగాను, ఒక్కటిగా పర్యవసించడానికిగాను అతడు కోరి రూపొందించుకొన్నవే ఈ ఉపాధులు. కనుక ఆ దివ్యస్థితిలో దేహాలు కూడా దివ్యోపకరణాలు అవుతాయి. అసలు ఇవి ఎందుకున్నాయో, ఎలాంటి దివ్యస్థితిలో ఉన్నాయో, ఎంతటి అనుభూతిని అందుకోవడం కోసం అవి రూపొందించబడ్డాయో అప్పుడు మనకు తెలియవస్తుంది. సేవించడానికి అందివస్తాయి. అనుభూతి చెందడానికి అడ్డుపడవు. హృదయస్థితి నుండి, చర్మస్థితి వరకు ఒకే అనుభూతి. దేహాలు లీలగా, అవలీలగా వర్తించడమంటే ఏమిటో అప్పుడు తెలుస్తుంది.

సృష్టిసాగుతుండగా ఇంతటి అనుభూతి అందిరావాలి! అది దేవదేవుని ప్రణాళిక. అందుకు దేహధారులు దగ్గర కావాలి. ఆ దగ్గర కావడం కొరకే బంధుమిత్రులుగా రూపకల్పన! ఆ దగ్గర కావడం కొరకే గృహస్థాశ్రమాన్ని అతడు రూపుదిద్దడం. ఆ దగ్గర కావడం కొరకే ఊళ్ళుగా, పట్టణాలుగా రూపొందించి మానవుణ్ణి ఒక పౌరునిగా రూపొందించడం. సహజీవనాన్ని సాధించడం, సాంఘిక సహజీవనంలో జీవితానికి పరమావధి చూపించడం ఇవన్నీ కూడా ఒకరికొకరు దగ్గర కావడం కొరకే! ఇలా అతడు దేహధారులను ముచ్చటగా దగ్గర చేస్తున్నాడు. తాదాత్మ్యస్థితిని అందుకోవడానికి దివ్యమయిన అవకాశాలను అందిస్తున్నాడు. ఎక్కడోలేను ఎక్కడికక్కడ నీ ఎదుటనే ఉన్నాను. అనేక విధాలుగా నీతో శ్రుతి కలుపుతున్నాను. నీవు నన్ను నన్నుగా అనుభవించాలి అంటే మూడు సోపానాలు ఎప్పటికప్పుడు ఎక్కి రావాలి! అవి ప్రణిపాతము, పరిప్రశ్నము, సేవ. చూసారా! ఒకరికొకరు దగ్గరై, ఒకరినొకరు సేవించుకోవడంలో ఇంత పరమార్థాన్ని నిక్షిప్తం చేసి ఉంచాను నేను. ఇక మీరు అందుకోవడమే తరువాయి. అసలు ఇంత సృష్టిగా దిగివస్తున్నది, ఇలా నిక్షిప్తం చేయబడిన ఈ పరమానంద స్థితిని మీరు అందుకోవడానికే, అనుభవించడానికే!

చిన్నపిల్లలు దాగుడుమూతలాట ఆడతారు. ఆ ఆటలో కావాలని ఒకరు దొంగగా మారి



దాక్కొంటారు. మిగిలిన వాళ్ళు ఆ దొంగను పట్టుకొనే ప్రయత్నం చేస్తారు. ఆ ప్రయత్నంలో ఒడుపు చూపగలిగినవారు దొంగను పట్టుకొంటారు. దొరికాడు, దొరికాడు అంటారు. అందరూ చప్పట్లు కొడతారు. కేరింతలు కొడతారు, ఉవ్వెత్తున ఎగురుతూ ఉల్లాస పడతారు. మళ్ళీ ఈసారి అని మళ్ళీ ఆట మొదలు పెడతారు. అలా రోజూ ఆడుకొంటూనే ఉంటారు. ఎంత ఆడినా తనివి తీరని ఆట. రోజూ ఆ ఆట కోసం, ఆ వేళకోసం ఎదురుచూస్తూ ఉంటారు. ఈ సృష్టి అలాంటి దాగుడుమూతలాట! నామరూపాలమాటున దాగియున్న ఆ దేవదేవుణ్ణి వెతికి పట్టుకొనే దాగుడు మూతలాట ఈ సృష్టి! ఆ దొంగను పట్టుకోవడానికి కావలసిన ఒడుపు ఈ అభయవచనంలో చెప్పబడుతుంది. "శరణాగతి చెందు, పరిప్రశ్నము చేయి – తృప్తిగా సేవించు". నేనిక దొరికిపోతాను. అప్పుడు నీవే నేను. నేనే నీవు. ఆ దివ్యస్థితిని అందుకోవడానికే ఈ సృష్టిలీల అంటున్నాడు దేవదేవుడు. తనను పట్టుకొనే మార్గం చెబుతున్నాడు. ఈ సుళువును గ్రహించమంటున్నాడు.

ఒక చిత్రమయిన విశేషమేమంటే ఒడుపు ఏ మాత్రం తగ్గినా మానవుడు ఎదుటనున్న వారిని నామరూపాలవరకే చూడగలుగుతాడు, అంతకుమించి లోపలకు చూడలేడు, చిత్రమయిన ఏమరుపాటు ఇది. ఈ ఏమరుపాటు వల్ల నామరూపాలే నిజమనిపిస్తాయి. అసలువాడు అంతుపట్టడు. అతడివైపుకు దృష్టికూడా పోదు. ఒక్కొక్కప్పుడు అసలతడున్నాడని కూడా అనిపించదు. మనలోని మనస్సు ఎదుటివానిలోని మనస్సు వరకే చూడగలుగుతుంది. కామక్రోధాలు, రాగద్వేషాలు తలయెత్తుతాయి. అభిప్రాయాలేర్పడతాయి. అవి మెల్లగా కరుడు కడతాయి. దృక్పథాలేర్పడతాయి. అవి క్రమంగా స్థిరపడతాయి. ఇలా మనిషి తనను తాను బిగించుకుంటాడు. బంధనాల్లో పడతాడు. దానితో తాను అనుకొన్నదే తప్ప అక్కడ ఉన్నది కనపడదు. అప్పుడేం జరుగుతోంది! మానవుడు ఈ ప్రపంచంలోనే తన ప్రపంచాన్నొక దానిని సృష్టించుకొంటున్నాడు. తానందులో బందీ అవుతున్నాడు. బందీయై విలవిలలాడుతున్నాడు. ఇది దారుణస్థితి. ఈ దారుణస్థితి నుండి మానవుణ్ణి ఉద్ధరించి నిలబెట్టడానికై తత్త్వజ్ఞానులయిన మహనీయులుంటారు. వారు మనం దీపారాధనలో ఒత్తిని ఎగదోసినట్లు మన మనస్సును పైకి ఎగదోస్తారు. అప్పుడు ఆ ఒత్తికి కట్టిన కొడి రాలిపోతుంది. వెలుగు విజృంభిస్తుంది. పరిసరాలు గోచరిస్తాయి. అక్కడ ఉన్నదేమిటో అనుభవానికి వస్తుంది. దానితో మన జన్మకు తెల్లవారుతుంది. ఇక్కడ దేవదేవుడయిన సద్గురువు చెబుతున్నదేమంటే నీవు నీవుగా, ఇరుక్కుపోతున్న



వేళ నేను తత్త్వజ్ఞానులయిన మహనీయులరూపంలో దిగివచ్చి నిన్ను మేలుకొల్పుకొంటున్నాను సుమా! అని రాగద్వేషాది దారుణ స్థితులకు ఆలవాలమయిన పరిస్థితిలో నీవు ఎక్కువకాలం విలవిలలాడిపోకుండా కనిపెట్టుకొని కాచుకొంటున్నాను సుమా! అని. ఆ విలవిలలాడే స్థితి నుండి బయటపడాలనిపిస్తే నా చేయూత నీకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది – అని. కావాలనుకుంటే చాలు కనబడి కలుగచేసికొనే నా అభయహస్తం నీతో ఉన్నది – అని.

కావలసిన విధంగా నేను కలుగచేసుకొన్నప్పుడు అప్పటికి తగిన నామరూపాలతో నీకు కనబడతాను. ఆ నామరూపాలు, ఆ మహనీయస్థితి నీకు నచ్చుతాయి. 'నా' అనుగ్రహ విశేషం చేత నీవు నాకు దగ్గరవుతావు. నేను గురుమూర్తినై నిన్ను శిష్యునిగా స్వీకరిస్తాను. నీవు నన్ను శరణాగతి చెందుతావు. విధేయతతో ఒదిగి ప్రవర్తిస్తూ, నాలోనికి చూడగలుగుతావు. అలా చూడటంలో పరిప్రశ్నం నీకు సహకరిస్తుంది. ఆ చూసిన వెలుగును అనుభవించడానికిపరిచర్య నీకు ఉపకరిస్తుంది. ప్రణిపాతము, పరిప్రశ్నము, పరిచర్య, అన్న మూడు సోపానాలలో నీవు నాకు దగ్గరవుతావు. నీవే నేనుగా రూపొందుతావు. అటుపైన 'నన్ను' జగత్తంతటా చూడగలుగుతావు. విశ్వరూపసందర్శనాన్ని అనుభవించగలుగుతావు. ఇలా దైవమైన నేను మహనీయుడుగా వ్యక్తమై గురువుగా నీకు దగ్గరై నా అక్కున నిన్ను చేర్చుకొని, అంతటా నేనే గోచరిస్తూ, విశ్వరూప సందర్శనం వరకు నీ సాధనను సాగేట్లు చూస్తాను. ఇలా పడిపోతున్న నిన్ను పట్టుకొని, పరిణితి నీకు లభించేవరకు వెన్నంటి నిన్ను నడిపిస్తాను. సమస్త బంధనాల నుండి నిన్ను విడిపిస్తాను. నేనే నీవుగా, నీవే నేనుగా అనుభవానికి వచ్చే ఒకానొక దివ్యస్థితిలో నీ జన్మ కర్మలను నా లీలా విశేషంగా ప్రకాశింపచేస్తాను **పరివర్తన** కలిగే వరకు.

ఇక్కడ మరొక చిత్రం ఉన్నది. మామూలు మానవుడే రాగద్వేషాది దారుణ స్థితులలో చిక్కుకున్నపుడు తట్టుకొనలేడు. అలాంటపుడు, కొంతకాలం సాధన మార్గాన నడిచి, ఎదుట ఉన్న వారి రూపాన ఉన్న దేవదేవుని పొడగట్టించుకొని, ఆ అనుభూతి చెందినవాడు, సందర్భవశాన ఏమరుపాటు చెంది, నామరూపాలకు పరిమితమై రాగద్వేషాలకు లోనయ్యాడనుకోండి. అప్పుడతనికి మరీ ఇబ్బందిగా ఉంటుంది. అది తన నిజస్థితి కాదని తెలుసు. తాను క్రిందకు జారడం జరిగిందని కూడా తెలుసు.



కాని పైకెక్కడమెలాగో తోచదు. అలా ఉండలేదు, దానికతీతుడు కాలేడు కర్తవ్యమేదో తెలియని స్థితి ఏర్పడుతుంది. అంతా అయోమయంగా ఉంటుంది. ఒక విధమైన ఆందోళన కలుగుతుంది. అశాంతి అనుభవానికి వస్తుంది. అలాంటి వేళలో దేవదేవుడు తత్త్వజ్ఞానులయిన మహనీయుల రూపంలో మనను వెతుక్కుంటూ వస్తాడు. అప్పటికి కావలసిన నామరూపాలతో, వేషభాషలతో మనకు దగ్గరవుతాడు, ఓదారుస్తాడు, సేదతీరుస్తాడు, చేయూతనిస్తాడు, లేపి నిలబెడతాడు, కర్తవ్యోన్ముఖులను చేస్తాడు, పరమ ప్రశాంతిని అనుభవింపచేస్తాడు. దానితో మళ్ళీ మనకు దర్శనం అందుతుంది. నామరూపాలకు అతీతమయిన స్థితిని అందుకోగలుగుతాం. **తాదాత్మ్యస్థితిలో జీవితాన్ని ఒక ఉత్సవంగా నడుపగలుగుతాం.**

ఈ అభయ వచనం విషయమై ఆధునిక కాలంలో షిరిడీసాయి ఒకచిత్రమయిన మెలుకువను చూపారు. మామూలుగా 'ఉపదేక్ష్యంతి తే జ్ఞానం' అన్నప్పుడు వారు జ్ఞానాన్ని ఉపదేశిస్తారు అని అర్థం వస్తుంది. నానాచందోర్కర్ శ్రీసాయి సన్నిధిలో కూర్చుని ఈ శ్లోకాన్ని వల్లెవేస్తుండగా ఆయన అన్నారు కదా! 'ఉపదేక్ష్యంతి తే అజ్ఞానం' అని ఎందుకనుకోకూడదు? అని. నానా తెల్లబోయారు. తెల్లబోవడానికి మొదటి కారణం శ్రీసాయికి సంస్కృతం వచ్చునని నానాచందోర్కర్ అనుకోలేదు. రెండవకారణం ఈ చెబుతున్న మార్పును ఆయన ఎలా అన్వయిస్తాడు అని.

కాసేపు మౌనం నడిచిన తరువాత, 'ఉపదేక్ష్యంతి తే అజ్ఞానం' అన్నప్పుడు ఒక అక్షరం ఎక్కువవుతుంది కదా. వ్యాకరణం తప్పిపోతుందనా నీ భయం! వ్యాకరణానికి ఇబ్బంది కలిగించనక్కరలేదు. 'ఆ'కారానికి బదులుగా అవగ్రహాన్ని పెట్టుకుంటే సరిపోతుంది. 'ఉపదేక్ష్యంతి తే అజ్ఞానం' అని వ్రాస్తే సరిపోతుంది. అవగ్రహమంటే కరువు. ఇక్కడ ఆకారమున్నదిగాని దానికి కరువొచ్చింది అన్న మాట. అంటే లోపించిందన్నమాట. ఈ వివరణకు నానా ఆశ్చర్యపోయాడు. పండిపోయిన వాని ముందు తన పాండిత్యమెంత? అనుకొన్నాడు. సర్వజ్ఞానిముందు తన జ్ఞానమెంత అనుకొన్నాడు. అనుకొంటూనే మళ్ళీ ఇలా అనుకొన్నాడు. వ్యాకరణ పరంగా బాగానే చెప్పారుగాని, అన్వయపరంగా ఎలా చెబుతారా అని!

మళ్ళీ కాసేపు మౌనం నడిచిన తరువాత షిరిడిసాయి ఇలా అన్నాడు : ఈ చెప్పబడిన దానికి అన్వయమెలాగ? అనిపిస్తోంది కదూ నీకు! ఇదిగో, ఇలాగ! మనలో ప్రతి ఒక్కరము జ్ఞానస్వరూపులమే! సృష్టిలీలలో భాగంగా మనసు అజ్ఞానం ఆవరిస్తోంది. తత్త్వజ్ఞానులైన మహనీయుల రూపంలో ఆ



అజ్ఞానాన్ని ఎలా తొలగించుకోవలసిందీ దైవం మనకు ఉపదేశిస్తుంది. తొలగవలసినది అజ్ఞానం, అజ్ఞానమంతా తొలగిన క్షణంలో జ్ఞానం అక్కడ వెలుగుతూ ఉంటుంది. మనమే జ్ఞాన స్వరూపులం కదా! కనుక ఏ మహనీయుడయినా ఏం చెబుతున్నాడు? ఏది అజ్ఞానమో చెబుతున్నాడు. ఆ అజ్ఞానాన్ని ఎలా తొలగించుకోవాలో చెబుతున్నాడు. అందుకే నేను 'ఉపదేక్ష్యంతి తే అజ్ఞానం' అని చెబుతున్నాను ఏమంటావు? బాగుంది కదూ! అంటూ ముసి ముసి నవ్వులు నవ్వారాయన!

భగవద్గీత చదివిన పుణ్యానికి శ్రీకృష్ణుడే షిరిడిసాయి రూపంలో ఇలా నన్ను ఆటపట్టిస్తున్నాడు. తన వాక్యానికి తానే భాష్యం చెబుతున్నాడు అని మురిసిపోయాడు నానా. 'తత్త్వజ్ఞానులయిన వారి రూపంలో కలుగచేసుకొని, కావలసిన మార్పు నీలో తీసుకొని వస్తాను – అన్న అభయ వచనం నానా విషయంలో ఇలా నిజం చేసారు. అతడిలా నిజం చేస్తూనే ఉంటారు. మనం గమనించుకోవడమే తరువాయి.

**– పార్థసారథి ప్రవచనాలు**

## శ్రీబాబూజీ

***(గత సంచిక తరువాయి)*** నిజంగా మనం దైవాన్ని దైవం కోసం ప్రార్థిస్తే దైవమే మానవాకారం ఎత్తి మనలను ఉద్ధరించడానికి అవతరిస్తారని శాస్త్రవాక్యం. గురువు దొరకడం ఆ జిజ్ఞాసువుల పాలిట వరమైంది. సత్సంగం అయిన తరువాత కొందరు గురువుగారిని పర్సనల్‌గా కలిసి మాట్లాడాలని గురువుగారి పర్మిషన్ తీసుకొని మాట్లాడేవారు. వాళ్ళ గతచరిత్ర, వాళ్ళు చేసిన తప్పులు, అగమ్యగోచరమైన వాళ్ళ భవిష్యత్తుపట్ల వాళ్లకున్న ఏంగ్జయిటీ అన్నీ గురువుగారి ముందు మనసువిప్పి చెప్పుకొని, భోరున ఏడ్చేసేవాళ్లు. వాళ్లలో కొందరికి గురువుగారికి ఉన్న జన్మాంతర ఋణానుబంధం ఏమిటోగాని మొదటి దర్శనంతోనే సరెండర్ అయిన వాళ్ళు కొందరైతే, నెమ్మదిగా సత్సంగాలకు వస్తూ శరణాగతి చెందిన వాళ్ళు కొందరు. ఈ రోజుకీ వాళ్ళు గురువుగారిని అంటి పెట్టుకోవడమే గాకుండా వాళ్ళ ద్వారా గురువుగారి వద్దకు వచ్చి గురువుగారికి శరణన్న వాళ్ళు ఎందరో. అలా ఒక ప్రవాహంలాగా విదేశీయులు గురువుగారి సన్నిధికి వస్తూనే ఉన్నారు.

అరుణాచలంలో గురువుగారు సత్సంగం చెపుతూ ఉన్నపుడు రమణమహర్షి జీవితంలోని ఒక సంఘటనను ఉదహరించి ఒక విదేశీయుడు హేళనగా మాట్లాడారు. ఆ సంఘటన భగవాన్ భోజనం



చేసాక విస్తరిని పారవేస్తే దానిలోని మిగిలిన పదార్థాల కొరకు భక్తులు కుక్కల్లాగా ఆకుపై పడేవారని, ఆ విషయాన్ని చులకనగా చేసి మాట్లాడగానే గురువుగారు చాలా సీరియస్ అయ్యారు. నీకేం తెలుసు దానిలోని గొప్పతనం. గురువు ఉచ్ఛిష్ఠం తింటే చాలు మన కర్మ నశించి ముక్తులమవుతాము. నీవు వచ్చింది మాత్రం వారి ఎంగిలి నుండి వచ్చిన బోధను విని తరించడానికి కాదూ. నీకూ వాళ్ళకు ఏమీ భేదం లేదు. చర్యలు తప్ప. ఎంతో విశిష్ఠ సాంప్రదాయం అది అని ఎంతో ప్రశాంతంగా చెప్పారు. మొట్టమొదట మాత్రం కాలరుద్రులే అయ్యారు.

భగవత్తత్వాల గురించి ఎంత అద్భుతంగా వాళ్ళకు చెపుతారంటే వాటిని అర్థం చేసుకొని ఆ తత్త్వం మూర్తీభవించిన మూర్తికి పూర్తిగా శరణాగతి భావంతో శ్రద్ధా భక్తులతో నమస్కరించుకోవాలి, లేకుంటే ఆ తత్త్వంలో లీనమై విగ్రహారాధనను మానివేయాల్సిందే.


ఎందరో గురువుల వద్దకు పోయి వాళ్ళ తృష్ణ తీరక, గురువులు చెప్పిన కఠిన నియమాలను ఆచరించలేక, ఈర్ష్యా అసూయలతో కూడిన ఆశ్రమాలలో గడిపి, స్వార్థం కోసం వీళ్ళను వాడుకొనే గురువుబారి నుండి తప్పించుకొని వాళ్ళ సాధనకు మార్గం చూపే సద్గురు అన్వేషణ మన గురువుగారి దర్శనంతో తీరిందని, ఇక మాకు ఎక్కడకు పోవలసిన అవసరం లేదని వీరే మాకు నియత గురువులని ఎంతో సంతోషంతో, సంతృప్తితో వాళ్ళకు సరైన మార్గదర్శిని చూపిన రమణ భగవానునకు కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

ఎన్నో సంవత్సరాల నుండి వస్తున్నా మాకు సాధనలో సరైన గైడ్ లేక, ఏమి చేసుకోవాలో అర్థం కాక, మేము బుక్‌లో చదివినవే – మేం చేసుకుంటున్నాము. మాలో ఎటువంటి ప్రోగ్రెస్ లేక డ్రైగా ఉన్నాము. ఇన్ని సంవత్సరాలు వేస్ట్ అయినట్లే అని బాధపడుతుండగా వారితో, వృధాగా ఎందుకు బాధపడటం ఇన్ని సంవత్సరాల తపనను భగవాన్ సద్గురు రూపంగా అవతరించి తీర్చారు. ఇక మాకు గురువుగారే భగవాన్ అని ఎంతో ఉద్వేగంతో, ఆనందంతో అన్నారు.

విదేశీయులంటే ప్రపంచం నలుమూలల నుండి ఎన్నో దేశాల వాళ్ళు వస్తారు. వాళ్ళ మాతృభాష ఇంగ్లీష్ కాదు, ఎవరి ఏక్సెంట్ (ఉచ్ఛారణ) వారిది. అందరి ప్రశ్నలు అర్థం చేసుకొని వాళ్ళు సమాధానపడేటట్లు చెప్పగలగడం సామాన్యవిషయం కాదు. *(మిగతా 18వ పేజీలో)*



## బాబాకు దగ్గరవ్వాలంటే



**భక్తుడు :** సచ్చరిత్రలో ఒకరు చేస్తున్న సేవను ఇంకొకరు విమర్శించారని, బాబా కడుపులో సటకా పెట్టుకొని గ్రుచ్చేసుకొని అందరూ బెదిరి పోయేటట్లుగా చేసారు. ఆ సందర్భంలో వాళ్ళు కూడా ప్రేమకొద్దీనే కదా చెప్పింది! ఎందుకు ఆయన అంత తీవ్రంగా స్పందించారు? ఒకరు చేసిన దానిని ప్రేమగా విమర్శిస్తే తప్పు ఏంటి?

**గురువుగారు :** ప్రేమగా విమర్శించారో, లేదంటే 'వీళ్లకే ఎక్కువగా ఆయనమీద భక్తి ఉన్నట్లు, అవతలివాళ్ళు ఏదో భక్తి లేకుండా చేస్తున్నట్లు' అనే భావంతో చెప్పారో! ఆ చెప్పినటువంటి భావానికి అనుగుణంగా ఆయన రియాక్ట్ అయ్యుంటారు.

**భక్తుడు :** అంటే విమర్శిచడమే తప్పు అంటారా?

**గురువుగారు :** విమర్శించడం ఎప్పుడూ తప్పే. ఎందుకు విమర్శించాలి మనం?

**భక్తుడు :** దానివలన ఏమవుతుంది? విమర్శిస్తే ఏమవుతుంది?

**గురువుగారు :** బాబాకు దూరమవుతాం. బాబాకు ఇష్టంలేనిపని అది. బాబా మాటల్లో చెప్పాలంటే, విమర్శించడం అనేది 'పంది పెంటను తినడం వంటిది'. ఒక వ్యక్తి ఎవరి గురించైనా చెడుగా మాట్లాడితే బాబా చెప్పిన మాట అది. నా మాట కాదది. ఒకడు కూర్చుని మరొకడిని విమర్శిస్తుంటే ఒకసారి లెండీకి పోతూ, పోతూ ఒక పంది అక్కడ ఎవరో మలం కూర్చుని ఉంటే తింటావుంది. తింటున్న దాన్ని చూపించి "ఒరే! నువ్వు చేసిన దానికి, అది చేసే దానికి తేడా ఏమైనా ఉందా? నువ్వు చేసేదదే" అన్నారు. ప్రతి ఒక్కరిలోనూ దుర్గుణాలున్నాయి, లోపాలున్నాయి, బలహీనతలున్నాయి. ఈ బలహీనతలు, అవి మన మనస్సులో ఉండే మాలిన్యం లాంటిది. మలం లాంటిదది. ఎవరికి వాళ్లకి తెలుసది. ఉందని తెలిసినా మనంతట మనం పోగొట్టుకోలేకున్నారు. దానికోసమే సద్గురువు దగ్గరకు వచ్చారు. ఈ మలాన్ని గురించి మనం మాట్లాడటం ద్వారా మన నాలుకతో దాన్ని కడుగుతున్నాం. అది బయట ఉండేటువంటి మలాన్ని తింటుంది. ఈ రకంగా ప్రక్కనవాళ్లని విమర్శించేటువంటివాడు నాలుకతో మానసికంగా వాడి యొక్క మలాన్ని తింటున్నాడు. ఇద్దరు చేసే



పని అదే. అలా ఎదుటివారిని విమర్శించడం మనమెందుకు చేయాలి? అది బాబాకు ఇష్టం లేని పని. బాబాకు ఇష్టంలేనటువంటి పని చేయడం వలన బాబాకు దగ్గరకాలేము. దాంట్లో రెండు రకాలున్నాయి. వేరే వాళ్ళని విమర్శించడం ద్వారా తెలియకుండానే తనకు ఈ బలహీనతలు లేనట్టు, ఎదుటి వాడికే ఆ బలహీనతలున్నట్లు, తను చాలా గొప్పవాడయినట్టు ఫీలింగ్ రాదూ?

ఎవరో ఒక సామెత చెప్పారు. ఎక్కడో విన్నా – ఒకచోట ఒక సమారాధన జరుగుతుందట. అందులో పండితులు కూర్చున్నారు, తిన్నారు. ఇక పోతూ ఉండేటపుడు తలా అందరికీ పది రూపాయలు సంభావన ఇస్తున్నారు. ఆ ముందు ఆయనకి ఒక పది రూపాయలు ఇచ్చారు. వెనుకుండే ఆయన వచ్చాడు. ఆయనకూ పది రూపాయలు ఇచ్చారు. ఆయనకు ఎక్కడలేని కోపం వచ్చేసిందట. "ఆత్మస్తుతి–పరనింద లేని నాకు ఈ వెధవకి ఒకే సంభావన"? అన్నాడట (నవ్వులు). 'వాడు వెధవ' అనడంలో 'పరనింద' చేస్తున్నాడు. నేనింత గొప్పవాడినని 'ఆత్మస్తుతి' చేస్తున్నాడు. ఇవేవీ లేవని చెబుతున్నాడు మళ్ళా. ఇట్లా విమర్శల జోలికి పోవద్దు. వాళ్లట్లా చేస్తున్నారు, వీళ్ళట్లా చేస్తున్నారు అని మనకొద్దు! వాళ్లలో లోపం ఉంటే బాబా చూసుకుంటారు. మనల్ని బాగు చేయడానికి బాబా ఉన్నట్లు, వాళ్ళని బాగుచేయడానికి బాబానే ఉన్నారు.

ఆ లోపాలు మన మనసుకిగాని వస్తే అవి మనలో ఉన్నాయా లేదా అని చూసుకోండి. మనలో లేకుండా జాగ్రత్త పడాలి.

బాబాకి దగ్గర కావాలి అంటే, బాబాకి ఏం ఇష్టం? మనం ఎలా ఉండాలి అని బాబా అనుకుంటున్నారు? అలా ఉండటం. బాబా ఉన్నాడు మనల్ని చూసుకోవడానికి, ఆ sense of security అది మనకిస్తూ మనల్ని ఇలా చూసుకునేటువంటి ఆయనతో minimum ఒక ఐదు నిమిషాలకన్నా ఆయన దగ్గర కూర్చుందాం అని రోజూ ఆ భావంతో ఊరకనే బాబా ఫొటో ముందు పది నిమిషాలపాటు కూర్చోండి అయన్ని చూస్తూ చాలు. ఇంకేమీ పన్లేదు.

మనకి అవకాశం వచ్చింది. మనల్ని ప్రేమిస్తూ, మనల్ని ప్రేమించేటువంటి ఆయన గురించి కాసేపు మాట్లాడుకుందాం. దాన్ని సత్సంగం అన్నాం, పేరు పెట్టాందానికి. ఇంతే ఇంకేం చెయ్యక్కరలా మనం. ఇలా చేస్తే బాబాకి నెమ్మదిగా మీరే దగ్గరవుతారు.

**–శ్రీబాబూజీ**

**కర్తవ్యం అంటే సాకులు చెప్పకుండా దాన్ని నెరవేర్చగలగడం.**



*(16వ పేజీ తరువాయి)* వాళ్ళ హృదయం నుండి పుట్టిన ప్రశ్నకు సమాధానం వాళ్ళ హృదయానికి తాకేలాగా చెప్పగలగడం ఒక్క సమర్థ సద్గురువుకే చెల్లుతుంది.

"గురువుగారితో కలసి అరుణాచలంలో ఎక్కువకాలం ఉండగలిగే భాగ్యం గురువుగారే ప్రసాదించారు నాకు. వారికి సేవ చేసుకుంటూ సత్సంగాలలో పాల్గొంటూ పవిత్రమైన క్షేత్రంలో తిరుగుతూ ఉండగలిగిన కాలం నా జీవితంలో ఎంతో విలువైనది. కేవలం తమ జీవితాలను సాధనకే వినియోగం చేసుకుంటూ ఎన్నోరకాల పుస్తకాలు చదువుతూ, ప్రదక్షిణలు (రమణ సమాధికి, గిరికి) జపం, ధ్యానం అన్నీ క్షణం కూడా వృధా కాకుండా చేసుకొంటూ ఉన్న వాళ్ళకు ఒకరోజు సత్సంగంలో మనం చేయాల్సిందేమీ లేదు, భగవత్ కృపవలన రావాల్సిందే" అన్నారు. ఆ మాటకు అందరం ఒక్కసారి షాక్ తిన్నాము. కారణం సాధన చేయకుండా భగవంతుడి కృప ఎలా వస్తుంది? మనం ఇప్పుడు చేస్తున్నదంతా వృధానేనా? అసలు భగవత్ కృప ఎలా పొందాలి? అన్న సందేహాలు అందరినీ ఆవరించాయి. దానికి సమాధానంగా గురువుగారు 'మనం చేసేది ఏమీ లేదు. **'అనుగ్రహం కోసం నిరీక్షించాల్సిందే'** అన్నారు. ఎలా ఏమీ చేయకుంటే ఎట్లా? ఎంతకాలం నిరీక్షించాలని నన్ను ఎంతగానో తొలిచివేసింది. ఆ ప్రశ్నకు సమాధానం అడిగితే ఆలోచించండి అన్నారు తప్ప సమాధానం మాత్రం చెప్పలేదు. మరుసటి సత్సంగం ముందు గురువుగారితో ఎంత ఆలోచించినా నాకు ఏమీ పాలుపోవడం లేదు సరిగదా! ఇంతవరకు నేను సాధనపేరుతో చేస్తున్నదంతా వృధాయేనా అన్న భావం నన్ను పిచ్చివాణ్ణి చేస్తుంది అని ఎంతగానో బాధపడుతూ గురువుగారితో మొరపెట్టుకున్నాను. నేను ప్రాధేయపడే కొలదీ గురువుగారు నవ్వుతూ మనం చేయాల్సిందేమీ లేదు, ఏమీ చేయకుంటేనే బాబా అనుగ్రహం లభిస్తుందని పకపకా నవ్వారు. నాకేమో అర్థం కావడం లేదు. ముందే షాక్‌లో ఉన్నానేమో–గురువుగారు నవ్వుతుంటే నాకు కోపం వచ్చింది. కానీ గురువుగారు ఏదో అద్భుతమైన ఆధ్యాత్మిక రహస్యం చెపుతున్నారు. అది నాకు అర్థం కాక మనస్సు చికాకుగా ఉంది. **'ఎలుకకు ప్రాణసంకటం, పిల్లికి చెలగాటం'**లా ఉంది నా పరిస్థితి. మీరు చెప్పే సమాధానం అర్థం కావడం లేదు. నాకు అర్థమయ్యేట్లు చెప్పమని దీనంగా ప్రాధేయపడ్డాను. కరుణాసముద్రులైన గురువుగారు నవ్వును ఆపి గంభీరవదనులై "మీరు అరుణాచలం వచ్చి ఎన్ని రోజులైంది" అన్నారు. అప్పటికి బాహ్యప్రపంచంలోకి వచ్చి ఆలోచించి గుర్తుతెచ్చుకొని, "21 రోజులైందని" అన్నాను. ఎందుకంటే గురువుగారు దగ్గర ఎప్పుడున్నా కాలం స్ఫురణకు రాదు.



"ఏ రోజైనా ప్రాక్టీసు గురించిగాని, స్కూల్ గురించిగాని, లైఫ్ గురించిగాని ఆలోచన వచ్చిందా? అని అన్నారు. "ఒక్కసారి కూడా రాలేదని" చెప్పాను. "అక్కడ మీరు లేకపోతే ఎలాగా అని అనిపించిందా?" అని అన్నారు. "అస్సలు అనిపించలేద"న్నాను. 'ఎందుచేత' అన్నారు. అప్పటివరకు దీన్ని గురించిన ఆలోచన రాని నాకు ఈ ప్రశ్నకు సమాధానం ఎంత ఆలోచించినా తట్టలేదు. అప్పుడు గురువుగారే "ఏ చింత లేకుండా నిశ్చింతగా ఇక్కడ ఉన్నారు. అందుచేత ఏ విధమైన యాంగ్జయిటీ లేకుండా ఉన్నారు. ఈ నిశ్చింత మీరు ఏ సాధన చేస్తే వచ్చింది చెప్పండి. ఎన్నో అనుభవాల సారం నిశ్చింతగా ఉండగలిగేటట్లు చేసింది. ఈ అనుభవాలు బాబా ఇచ్చినవే. వారు ఇవ్వకుంటే అనుభవాల వలన నిశ్చింత రాదు. నీవు నిశ్చింతగా కూర్చో. మీకు అవసరమైనవన్నీ చేస్తాను, మిమ్మల్ని చివరికంటా గమ్యం చేరుస్తాను". అన్న బాబా ప్రతిజ్ఞ విన్నారు గదా! అందుకని మనం నిశ్చింతగా ఉండటమే చేయాల్సింది. ఆ నిశ్చింత కూడా బాబానే ఇచ్చేది అని ఎంతో ప్రేమపూర్వకంగా ఉపదేశించారు.

ఆనాడు యుద్ధరంగంలో అర్జునుని విషాదాన్ని తమ బోధ ద్వారా తొలగించిన శ్రీకృష్ణులవారిలా గురువుగారు నాకు సాక్షాత్కరించారు. ఒకవైపు అద్భుతమైన అరుణాచల శిఖరం, సాయంత్రం చల్లనిగాలి ప్రశాంతమైన వాతావరణం, ఉండే వరుణాచలంలో తమ కుటీరం మిద్దెమీద తిరుగుతూ గురువుగారు బోధించిన బోధ నా జీవితంలో మరుపురానిది. ఆ సంభాషణతో నాలో చెలరేగిన తుఫాను అణిగిపోయి ప్రశాంత గంభీర వాతావరణం నెలకొన్నది నా అంతరంగంలో.

మా సంభాషణ ముగిసింది. ఒక్కొక్కరే విదేశీయులు వచ్చారు. సత్సంగం మొదలైంది. అందులో క్రొత్తగా ఇంగ్లాండు నుండి వచ్చిన వ్యక్తి ఉన్నాడు. అతను సాధన మార్గంలోకి రావడం క్రొత్త ఏదో తెలిసినవాళ్ళు పోతున్నారని అతను కూడా వచ్చాడు. నాలాగే అందరూ రకరకాల ప్రశ్నలు గురువుగారిని అడిగారు. అన్నింటికీ నాకు చెప్పిన సమాధానం చెప్పగా, చివరివాళ్ళు మీరే దీనికి సమాధానం చెప్పాలని శరణువేడితే, వారికీ నాకు చెప్పిన సమాధానమే చెప్పి నన్ను ఉదాహరణగా చూపారు. అప్పటికీ కొందరు దానికి సమాధానపడకపోతే, మీకూ అనుభవం వస్తే తప్ప ఆ 'నిశ్చింతగా కూర్చోవడం' అర్థం కాదు అన్నారు. అందరూ ఊదీ తీసుకొని లేచాము. ఆరోజే క్రొత్తగా వచ్చిన వ్యక్తి మాత్రం అలాగే ధ్యానస్థుడై ఎప్పటికో లేచి, నాకు తెలియకుండానే నేను ఏదో తెలియని ఆనంద పారవశ్యంలో పడిపోయాను. దీనిని పొందడానికి నేను చేసింది ఏమీ లేదు అని



ఆనందాశ్రువులతో, గద్గద కంఠంతో అన్నాడు. అప్పుడు గురువుగారు, “ఈతను ఏమి చేసాడని ఈ బ్లిస్ వారికి దక్కింది. అదే నేను చెప్పింది. మనం ఏదో చేస్తే వచ్చేదిగాదు అనుభవం. దానంతట అదే రావాలి. దానికి **‘గురుకృప’** కావాలి. దాన్ని పొందాలంటే నిశ్చింతగా ఉండటమే” అదే మొదటిసారి అయినా ఆ ఆనందానుభూతి గురువుగారి ప్రెజెన్స్‌లో లభించిన ఆనందంతో అతను గురువుగారి పాదాలపైబడి భోరున ఏడ్చాడు. అటువంటి అనుభూతి నాకూ కలగాలని బాబాను ప్రార్థించాను.

ఈ విధమైన అనుభవంతో కూడిన మలుపు విదేశీయులలో ఎంతో మార్పును తీసుకొని వచ్చింది. అప్పటినుండి సత్సంగానికన్నా ముందే ఎందరో వచ్చి గురువుగారు ఉండే మేడమీద ధ్యానం చేసుకునేవాళ్ళు. గురువుగారు రాగానే అందరూ లేచి ఒక్కొక్కరే గురువుగారి పాదాలకు నమస్కరించుకొని కూర్చుని ఎన్నో రకాల ప్రశ్నలు, సంశయాలు, సాధనలో మెలకువలు తెలుసుకోవడం, ఎన్నో విషయాల మీద డిస్కషన్స్‌తో కాలగతి స్ఫురణ లేకుండా సత్సంగం సాగిపోయేది. క్రమశిక్షణకు మారుపేరైన ఆ జాతీయులు ఎంత టైమ్ అయ్యిందీ చూసుకోకుండా అలా రాత్రులు గడపడం ఎంతో ఆశ్చర్యమేసేది. వాళ్ళకు జ్ఞానంపై ఉన్న తృష్ణ అలా గురువుగారిని కూర్చోబెట్టి అందరినీ సమాధానపరిచేట్టు చేసింది. రోజంతా వాళ్ళు విధించుకున్న సాధన చేసుకుంటూ, ప్రతిరోజూ సాయంత్రం సత్సంగానికి అటెండ్ అవుతూ, వాళ్ళకు రోజులు క్షణాల్లా గడుస్తున్నాయి. వాళ్ళలో ఏదో ఉత్సాహం, తెలుసుకుంటున్నామనే సంతోషం, ఏనాటికైనా మనమనుకున్నది సాధించగలమనే ఆత్మవిశ్వాసం, గురువుగారి సన్నిధిలో మాటలకందని ఆనందానుభూతి, అన్నీ కలిసిన అద్భుతస్థితి అందరిలో కొట్టొచ్చినట్టు కనిపించేది. వాళ్ళు పొందిన ఆనందానుభూతిని తమకు తెలిసిన సాధకులూ పొందాలనే కోరికతో ఎందరినో తీసుకువచ్చేవాళ్ళు. అలా అలా పెరిగి దాదాపు 30 మందికి పైన ప్రతిరోజూ వచ్చేవారు. ఊరికి దాదాపు 10 కిలోమీటర్లు ఉన్న వరుణాచలానికి వాళ్ళు సైకిళ్ళపై వచ్చి ఏ అర్ధరాత్రో పోయేవారు. వాళ్ళ ముఖాలను చూస్తుంటే వాళ్ళు ఏ శ్రమకు లోనుగాక ఎంతో ఆనందంతో వస్తున్నారని అనిపించేది. మన ప్రయత్నం లేకుండానే మనస్సు ధ్యానస్థమయ్యే అరుణాచలంలో, సద్గురు సన్నిధిలో సత్సంగభాగ్యం లభించడం నా పూర్వజన్మ విశేషం. ఆ రోజులు ఎలా గడిచాయో తలచుకుంటేనే మధురానుభూతిని కలిగిస్తుంది. గురుసేవ, గురుధ్యానం, గురుస్మరణ మనకు కల్గించిన సద్గురుదేవుల పాదాలకు శతసహస్ర నమస్కారములు అర్పించడం కన్నా నేను

చేయగలిగింది ఏమీ లేదు.



"ఋణానుబంధాన్ని విశ్వసించి, గుర్తుంచుకో. నీ వద్దకు ఏ ప్రాణి వచ్చినా ఆదరించు" అన్న బాబా సూక్తిని అక్షరాలా ఆచరిస్తున్నట్లుగా, గురువుగారు వారి వద్దకు వచ్చిన అందర్నీ బాబా ప్రసాదాలుగా భావించి, అందరికీ వాళ్ళు అడిగే ఎన్నో ప్రశ్నలకు వాళ్ళు విసిగించినా, గురువుగారు ఎటువంటి విసుగు లేకుండా ప్రశాంతంగా సమాధానమిస్తూ, ఎంతోహ్యూమరస్‌గా, ఎదుటివాళ్ళు భయపడకుండా ప్రశ్నించేలా ఎంకరేజ్ చేస్తుంటారు. అలా సత్సంగాలకు ఎందరో విదేశీయులు రావడానికి మిష అయిన ఇవాన్ వయర్ గురించి తెలుసుకుందాం. ఆమె జన్మస్థలం స్విట్జర్లాండ్. ఆమె బౌద్ధ సాంప్రదాయంలో ఒక కల్ట్‌కి సంబంధించిన టీచరు. వరుణాచలంలో గురువుగారు ఉన్న క్వార్టరుకి ప్రక్కన ఉన్న క్వార్టరులో ఉండేది. ఎప్పుడూ ప్రశాంతమైన వదనంతో రమణాచలంవైపు తిరిగి కూర్చుని ధ్యానస్థమై ఉండేది. ఆమె అందరితో పాటు సత్సంగానికి వచ్చి గురువుగారిని కన్నార్పక చూస్తూ సంభాషణను వింటూ ఉండేది. ప్రశ్నలేవీ వేసేది కాదు. ఆమెకు కలిగిన అనుభవాలను నాతో చెప్పేది. గురువుగారి సత్సంగ్ రూములోకి మొదటిసారి ప్రవేశించినపుడు బాబా ఫొటోను చూచి ఆశ్చర్యపడిందట. ఆమె ఇంటి నుండి గురువుగారి బెడ్‌రూములో ఉన్న బాబా ఫొటో కనిపించేదట. మొట్టమొదటిసారి ఆమె ఇండియా వచ్చినపుడు ఆమె స్నేహితురాలితో కలసి ఢిల్లీలో ఒక పార్కుకు పోయి ఇద్దరూ ఫొటో తీయించు కొన్నారట. ఫొటో చూస్తే వెనుక గోడమీద బ్యాక్‌గ్రౌండ్‌లో బాబా అభయహస్తం ఫొటో ముందు వీళ్ళిద్దరూ ఉన్నారట. అప్పటివరకు బాబా గురించి ఆమెకు ఏమీ తెలియదు. ఒకసారి ఆమె అన్న బహుమతిగా బాబా ఫొటో ఉన్న కీచైన్ పంపాడట. అప్పుడు ఆమెకు మొదటి ఫొటో గుర్తువచ్చిందట. ఇప్పుడు గురూజీ రూములో ఫొటోని చూచి ఈ ముసలాయన ఎవరో నన్ను వదలడం లేదే అని అనుకొన్నదట. ఇంకో విశేషమేమంటే మొట్టమొదటిసారి ఆమె గురువుగారికి నమస్కరించుకొన్నప్పుడు గురువుగారు అన్నమాట "బాబా ఈస్ బిహైండ్ యు" అని. ఆమె తీయించుకొన్న ఫొటోని చూపితే వెనుక బాబా అభయహస్తం ముందు ఈమె ఉంది. ఆ అనుభవం ఆమెకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించి గురువుగారు సామాన్యులు కారు అన్న భావాన్ని కలిగించింది. సత్సంగం అయిన తరువాత గురువుగారితో ఏదో ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవడానికి ఎదురుచూసి గురువుగారి అనుమతితో మాట్లాడుతున్నది. ఉన్నట్లుండి గురువుగారు "మీ ఇంటికి పో" అని అన్నారట. ఇప్పుడు ఇంటిలో



ఏమీ పనిలేదు. ఎందుకు పోవడం అని ఈమె అంటే "కాదు వెంటనే పొమ్మని" అన్నారట. ఇంటికిపోయి చూస్తే ఆమె భర్త తీవ్రమైన కడుపునొప్పితో మెలికలు తిరుగుతున్నాడట. అతనికి తగిన వైద్యం చేసి ఉపచారాలు చేసి వచ్చి గురువుగారి సర్వజ్ఞతకు ముగ్ధురాలైనదట. ఒకసారి సత్సంగంలో గురువుగారు సద్గురువుకు మన తలను అర్పించాలి అదే సర్వస్య శరణాగతి అంటే అని అన్నారట. ఆ మరుసటిరోజు ఆమెకు పూనాలో ఉన్న ఆమె స్నేహితురాలి వద్దనుండి ఒక ఫొటో వచ్చిందట. దానిలో ఆమె ఫ్రెండు తన తలను తన రెండు చేతులతో కాళికాదేవికి సమర్పించడం ఉంది. అది ఒక ట్రిక్ ఫొటోగ్రాఫ్. నిన్న సత్సంగంలో గురువుగారు చెప్పడం అదే విషయానికి సంబంధించిన ఫొటో రావడం ఆమెను ఆశ్చర్యాంబుధిలో ముంచెత్తింది. ఒకరోజు సత్సంగానికి ముందు ఆమె చేతిలో తెల్లమందార పువ్వుని పట్టుకొని ధ్యానం చేస్తూ కూర్చుంది. మామూలుగా గురువుగారు రాగానే వారికి ఆ పువ్వు ఇచ్చి పాదనమస్కారం చేసుకొని, కూర్చుని ధ్యానం చేసుకుంటున్నది. గురువుగారు సత్సంగం చేస్తూ ఆ పుష్పాన్ని గిరగిరా తిప్పినపుడు ఆమెలో ఏదో తిరిగినట్లు, రెండు చేతుల మధ్య ఉంచుకొన్నపుడు తను ఎంతో సెక్యూర్డ్‌గా ఫీల్ కావడం, రెండు వేళ్లతో సున్నితంగా స్పృశించినపుడు మనస్సు ఎంతో తేలికగా అవ్వడం, గురువుగారికి తన ఆత్మను పుష్పం రూపంగా సమర్పించిందో ఏమోగాని, గురువుగారు దానిని స్వీకరించి తన ఇష్టం వచ్చినట్లు ఆడిస్తున్నట్లు ఫీల్ అయింది. సత్సంగం జరుగుతున్నా ఆమె మాత్రం ధ్యానస్థమై ఏదో తెలియని అలౌకిక ఆనందంలో తేలియాడుతున్నట్లు ఆమె ముఖకవళికలు మాకు స్పష్టంగా తెలుస్తున్నది. గురువుగారు మాత్రం ఏదో పుష్పంతో ఆడుకున్నట్లు తప్ప వారికి ఆ పుష్పంపై దృష్టి లేదు. ఆమె పొందిన ఆత్మానుభూతి ఎంత మధురమో కదా! ఏ జన్మపుణ్యఫలమో ఆమె గురువుగారికి సర్వస్య శరణాగతి చెంది ఆమె సర్వబాధ్యతలను వారిపై వేసి నిశ్చింతగా ఉన్నట్లు ఆమె ప్రవర్తన అప్పటి నుండి మారిపోయింది. ఒకసారి ఆమె ధ్యానం చేసుకుంటుంటే గురువుగారు ఆమె ఇంటికి వచ్చినట్లు అనుభూతిని పొందింది. అది ఆమె భావన కాబోలనుకున్నది. గురువుగారు వరుణాచలం వదలి వచ్చేముందు ఆమె గురువుగారిని తమ ఇంటికి ఒకసారి వచ్చి పావనం చేయమని కోరింది. గురువుగారు ప్రసన్నంగా నవ్వి **"మీ ఇంట్లో నేను లేనా?"** అని అన్నారట. ఈమెకు కలిగిన అనుభూతి ఆమె భావం కాదని గురువుగారు కరుణించి ఆమెకు ఇచ్చిన అనుభవం అని అర్థమయింది. వీరు సామాన్యులు కారు దైవమే మానవరూపంగా



అవతరించిన సద్గురువే అన్న భావం ఆమెలో స్థిరమయింది.

సత్సంగానికి వచ్చే విదేశీయులందరూ భగవాన్ గురించి అంతకుముందు ఎన్ని పుస్తకాలు చదువుకున్నా, ఎన్నో విషయాలను ఎందరి నుండో విన్నా, ఎందరో గురువుల వద్ద ఎన్నో ఉపదేశాలు పొంది సాధన చేసుకుంటున్నా ఏదో తెలియని అసంతృప్తి వాళ్ళలో ఉండేదనిపిస్తుంది. ఎందుకంటే వాళ్ళు గురువుగారిని అడిగే ప్రశ్నలను చూస్తుంటే ఇంత చిన్న విషయం కూడా వీళ్ళు గురువుగారిని అడుగుతున్నారనిపించేది. ఏదో తెలియని భ్రమలో సాధన చేస్తున్నామని అనుకుంటూ గొప్ప సాధకులుగా భావిస్తూ, రమణాశ్రమంలోని ధ్యానమందిరంలో ఎక్కువగా గడిపేవాళ్ళకు మెల్లగా రమణభగవాన్ గురించి చెపుతూ వారిలోని సహజాతి సహజమైన ప్రేమను, మానవత్వాన్ని ఇతరుల పట్ల వారు చూపే ఆదరణను వారి చరిత్రలోని వివిధ సంఘటనల నుండి వాళ్ళకు విశదపరుస్తూ ఎంతో తన్మయత్వంతో అందరూ శ్రద్ధగా వినేలా చెపుతుండేవారు. ప్రతి సంఘటననూ గురువుగారు ఫీల్ అవుతూ ఎక్స్‌ప్లెయిన్ చేస్తుంటే వారికి భగవాన్ పట్ల ఉన్న ఎమోషనల్ ఎటాచ్‌మెంట్‌కి ఎంతో ఆశ్చర్యం వేసేది. అంతకు ముందు భగవాన్ చరిత్రలో చదివిన సంఘటనలైనా సరే గురువుగారు కొత్తకోణంలో చెపుతూ ఉంటే తన్మయమై వినడమేగాదు అందరి హృదయాలలో భగవాన్ పట్ల భక్తిభావం పెల్లుబికేది. అంతకుముందు తెలిసిన భగవాన్‌నే ఈ విధంగా రీ డిస్కవరీ చేసుకొని ఇంకా వారిపట్ల భక్తిశ్రద్ధలు పెరిగి వారు చూపిన మార్గంలో పయనించడానికి ఇంకా సులభతరమయ్యేది. ప్రతి సన్నివేశం భగవాన్ జీవితంలో చాలా ప్రాముఖ్యమైనదే. ప్రతిదానిలోనుండి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది అనిపించేది గురువుగారి ప్రసంగం వింటుంటే. పరిపూర్ణ మానవుడిగా లోకానికి భగవంతుడే అవతరించి మనలను కూడా తనలాగా ఎదగమని బోధిస్తున్నట్లుగా ఉంటుంది 'రమణమహర్షి' జీవితం అనిపించేది వారి మాటలలో. భగవాన్‌ది జ్ఞానమార్గమని, వారు బోధించినది జ్ఞానమని, అంతకుముందు మా అందరిలో ఉన్న అజ్ఞానాన్ని పారద్రోలి భగవాన్ ఎమోషనల్‌గా అరుణాచలేశ్వరుని మీద వ్రాసిన పంచకాన్ని ఉదహరిస్తూ వారిలోని భక్తిభావాన్ని ప్రస్ఫుటం చేస్తూ మా అందరికీ భగవాన్ పట్ల ఉన్న అపోహను తొలగించారు గురువుగారు. ఒక సందర్భంలో భక్తి జ్ఞానానికి తల్లి అన్న మాట గుర్తుకు రాకమానలేదు నాకు. రమణమహర్షిపట్ల గురువుగారికున్న గౌరవం, ప్రేమ అపారం. సాయిబాబా తరువాత వారినోటి నుండి వచ్చే మహాత్ముని పేరు భగవాన్‌దే. ప్రాపంచికంగా మనిషి నడవడిక, ప్రవర్తన, మానవత్వం గురించి ఎప్పుడూ



సత్సంగంలో వచ్చినా సరే భగవాన్ జీవితంలోని ఒక సన్నివేశాన్ని తప్పక ఉదహరించవలసిందే. వారి జీవితంలోని ప్రతి సంఘటనను మనం గమనించి శ్రద్ధగా ఆచరించగలిగితే మనం కూడా వారిలాగా పరిపూర్ణ మానవత్వంతో జీవితాన్ని ఆనందంగా గడపగలము అంటారు గురువుగారు. ***– డా॥ శ్రీనివాసులరెడ్డిగారు***

## హంస

ఏ చూపు అయితే అన్నింటిని, అందరినీ తనలోని భాగంగా చూడగలదో అదే దివ్యదృష్టి. దేనిని చూసినా, "అది కూడా నేనే, నాకంటే వేరుకాదు" అని అనుభూతి చెందుతూ. అలా చూడగలడగాన్ని 'హంస', 'సో–హం' అంటారు. 'సో–అహం' అంటే అది నేనే. అది ఏదైనా కానివ్వండి, అది నేనే.

***– 'దర్శనం' శరశ్చంద్రికలు 4.***

నేనొక భావ వ్యాపారిని. నాదంతా వింత వ్యాపారమే. నేను అమ్మని భావనలే లేవు. నేను చూడని ప్రదేశం లేదు. నేను తిరగని చోటు లేదు. అన్నిఊళ్ళూ నావే. అన్ని గుళ్ళూ నావే. అన్ని గూళ్ళూ నావే.

ఒకపరి ఎత్తైన పర్వతాల్ని అధిరోహిస్తాను. మరొకమారు అనంతసాగర (సంసార) గర్భంలోకి దూకి, పైకి వచ్చి, సరాగాల నురగల అలలపై ఆడుకుంటూంటాను. ఆకాశ హర్మ్యాలను ఇసుక తిన్నెలపై కడుతూంటాను. ఒకమారు ఎడారిలో ఎండమావుల్ని వెదకుతుంటాను. మరొకమారు జీవజలాల్ని మోసుకొచ్చే జీవ నదులలో జలకాలాడతాను. ఉదయసంధ్యకూ, సాయంసంధ్యకూ వారధినై పరవశించి పోతుంటాను. ఒకపరి ఎందులకో కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటాను. మరొకమారు ఏదో సంతోష సంరంభంలో మునిగి తేలుతుంటాను. ఒకప్పుడు క్షుద్బాధ పీడిస్తుంది. మరొకమారు ఏదో తెలియని ఆనందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటుంది. ఏదో వెలితి, ఏదో తపన నన్ను ఏవో తెలియని లోకాల్లో, మార్గాల్లో త్రిప్పుతుంటుంది.

తిరిగి, తిరిగి, అలసి సొలసి ఒకచోట విశ్రమిస్తాను. ఎక్కడ తిరిగినా, ఏం చేస్తున్నా నా వెంట ఒక 'హంస' వస్తూనే ఉంటుంది. అది నాతో సహజీవనం చేస్తుంటుంది. పొమ్మన్నా పోదు. ఏదో ఇస్తానంటూ, నాకేదో చేస్తానంటూ నన్ను బలవంతపెడుతూ ఉంటుంది. ఎన్నోమార్లు నేను దాన్ని గమనించడం లేదని, తృణీకరిస్తున్నానని పరితాపం చెందుతుంటుంది. ఎంతో తెల్లనిదీ, స్వచ్ఛమైనది



అయిన ఆ 'హంస' నాకు అన్నింటికన్నా ఆప్తురాలైనదని నేను అప్పుడప్పుడూ అనుకుంటూ, దాన్ని నాతోనే రానిస్తుంటాను. నాతోనే ఉండనిస్తుంటాను. నేను ఆ 'హంస'ని రానిచ్చినానని అన్నా, నాతోనే ఉండనిచ్చానని నేననుకున్నా, అసలు అది నా ప్రమేయమేదీ లేకనే నన్నల్లుకొని, నాతోనే ఉంటూ, నన్ను నిరంతరం కనిపెట్టుకొని ఉంటోంది. నిరంతరం 'సోహం' అనే పాటని పాడుతుంటుంది. ఆ మధుర రాగాన్ని వినమంటూంటుంది. అవన్నీ నాకెందుకు లెమ్మని నేనన్నా అవి నాకు అవసరమని చెబుతూనే ఉంటుంది. నా నడకకూ, నా నడతకూ, నా ఈ ప్రయాణానికీ ఆలంబనమై నన్ను ముగ్ధుణ్ణి చేస్తూంటుంది. ఎంత అందమైన నడకయో ఆ 'హంస'ది! బుల్లి బుల్లి అడుగులతో ఎంతకూ అంతరించని పూర్వ వాసనా ప్రాబల్యంతో సతమతమవుతున్న నాకు తన నోటితో తామరతూండ్లలోని అనిర్వచనీయ ప్రాణవాయువుల్ని, దివ్యచైతన్య స్రవంతుల్నీ నాలోనికి ఊది ఊది నన్ను పునర్జీవితుణ్ణి చేస్తూంటుంది. 'ఇది కాదు, ఇది కాదు' అని నూరిపోస్తూ, ఏవో లోకాల్లోనికి తీసుకు వెళ్తూంటుంది ఆ 'హంస'.

తిరిగి తిరిగి, అర్థంకాక, జీవిత పరమార్థమూ, ప్రయోజనమూ ఏదో తెలియక, ఏదో? ఎందుకో? ఏమిటోనని మాటవిని కొట్టుకుపోతున్న నన్ను మళ్ళీ బయట పడవేస్తూ తాను సంతోష పడుతుంటుంది. నాకు తెలియకనే, పథనిర్దేశం చేస్తూ, 'నన్ను' 'నా' వద్దకు చేరుస్తూంటుంది. ఎన్నోమార్లు నేను 'ప్రాణప్రదమైన' ఆ 'హంస' మాటల్ని వినను. అది నా కందిస్తున్న 'దివ్య' శబ్దాల్ని ఆలకించను. నాదే లోకంగా, అదే నా గమ్యంగా పట్టు తప్పి పయనిస్తుంటాను. తీరా చూస్తే ఎటూ తేలని, అటూ ఇటూ కాని, చుక్కాని లేని నావవలే నిరంతరం పయనంలో కొట్టుమిట్టాడుతూ, ఏవో అంధకార తీరాల్ని చేరుతుంటాను. చెప్పినా వినని, చూపించినా చూడని వింత ప్రకృతితో జీవిత మధురానుభూతుల్ని చేజేతులా జారవిడిచి పరిభ్రమిస్తుంటాను. ఆ 'హంస' చెప్పే అనుభవాలసారం 'ఇది' అని తెలిసినా స్వయంకృతాపరాధం నన్ను దుఃఖితుణ్ణి చేస్తుంది.

అయినా... ఆ 'హంస' నను వీడక, 'నెచ్చెలి' వలే నాతోనే పయనిస్తూ, ఏనాటికో ఓ నాటికి నేను తన దారికి రాకపోతానా? అని ఆశిస్తూ, 'సర్వాంతర్యామి' పాదకమలాలని చేర్చే సంకల్పంతో దివ్య, భవ్య పరిణామ విభవాల ప్రాంగణంలోనికి, 'హంస' నుండి 'సోహం' వైపుకి నా చేయి పట్టుకొని నడిపిస్తూనే ఉంటుంది... ఆ 'హంస'.

*–శ్రీ కొండూరి రమాకాంత్ (నావాణి)*



## గురుకృపాలహరి

సద్గురురాయా! మహాత్మా! మహర్షీ! మీ పదాలకు అక్షరార్చన ఎలా చేయగలనా? పదకుసుమాలతో పూజ చేసుకునే భాగ్యం నాకు ఎలా కలుగుతుందా అన్న ఆదుర్దా శరీరంలోని ప్రతీ అణువును ఛిద్రం చేస్తోంది. అల్లంత దూరాన అందని చందమామలా మీరు! ఆస్వాదించిన వెన్నెలను ఆసాంతం అనుభవించాలని నేను. సద్గురుస్వరూపులారా! చంద్రుని వెన్నెలను వర్ణించ కవితలల్లినా, కథలు చెప్పినా, అది భావనామయమే కాని స్వానుభవం కాదు కదా! అట్టిదే నా ఈ ప్రయత్నం. ఒక్కటిమాత్రం నిక్కము. గురుఅనుగ్రహ విశేషమే సద్గ్రంథపఠనం, గురుకృపా విశేషమే చిత్తశాంతము, గురుచరణ ఆశ్రయమే విశేష ఫలము. మా గురుపాదులు శరశ్చంద్రులు నాకు తల్లి, తండ్రి, దైవము అంతియే కాదు నాకు విశేష నేస్తము. వారితో నేను పంచుకోలేని కష్టము, సుఖము లేకుండెను. నా మనోమాలిన్యము లెక్కచేయక – అంతరంగమున ఆసీనులై చేతులు నావి అయినా చేతలు వారివి అని తెలిసి – నావంటి ఎందరో బద్ధ జీవులను – బుద్ధి జీవులుగా నిలిపిన కరుణాఘనులు – మా గురుచంద్రులు – శరశ్చంద్రులు. వాసనామయమై, క్షయమైపోతున్న నాకు నడయాడే దైవాన్ని స్తుతించే అవకాశమా! ఇది కేవలం మా గురుచంద్రులు మాతృమూర్తియై అక్షరక్షీరాన్ని నాకొసగి నన్ను ఆశీర్వదిస్తున్నారు, అమృతమందిస్తున్నారు. అడిగిన వారికి సమృద్ధిగా అందించిన శ్రీసాయినాథుని బిడ్డ మా గురుచంద్రులు. 'ఆత్మావై పుత్రనామాసి' అన్నారు కదా పెద్దలు. మా గురుచంద్రుల జీవితమంతే అనుగ్రహించడము – ఆశీర్వదించడమే! కామధేనువు, కల్పతరువు, చింతామణి వంటి వాటిని దర్శించ సాధ్యం కాదుగానీ, మా గురుదేవులను సాకార రూపులుగా దర్శించిన జీవులు ధన్యులు. ఆశ్రయించిన జీవులకు సమాధాన రూపమున సాకారులై, ఆలోచించిన క్షణాన సర్వకాల, సర్వావస్థలయందు తమ బిడ్డలతో వసిస్తూ, నిరాకారులై మా 'యోగక్షేమాలకు కర్తయై భాసించే సాకార నిరాకార స్వరూపులు వారు! ఇదిగో మాతల్లి (గురుదేవులు) 'నడయాడే దైవపు' స్మరణను తలపోసింది – 'గురుకృప'తో అక్షరవనం విరబూసింది.

అఖండ కావేరీ ఉత్తరతీరా మహేంద్ర మంగళంలో నదీ తీరాన ఒక పర్ణశాలలో పరమాచార్యుల జ్ఞాన సముపార్జన కొనసాగింది. ఎందరో పండిత ప్రకాండులు, తత్త్వవేత్తలు, కళాకారులు, పరిశోధకులు, వేదాంతికులు ఇలా ఎందరో స్వామివారికి విద్యను బోధించిన 'ఆచార్యులు'గా చరితకెక్కారు. వారిలో పంచపకేశ శాస్త్రులు, మహామహోపధ్యాయ, శాస్త్ర రత్నాకర వెంకట సుబ్బాశాస్త్రి, శాస్త్ర రత్నాకర విష్ణుపురాణం శాస్త్రి, వెంకటరామశాస్త్రి ఇలా ఎందరో! కొందరు కంచి మఠ అంతేవాసులై స్వామివారికి జ్ఞానకైంకర్యం



చేసుకునే భాగ్యాన్ని పొందారు. వారిలో మహామహోపాధ్యాయులు – కరంగులం కృష్ణశాస్త్రిగారు మరియు ఉభయ వేదాంత రాజగోపాల తాతాచారివారు అగ్రగణ్యులు. 1909–1914 సం॥ కాలంలో నగర జీవితానికి దూరంగా, అప్రతిహతంగా సాగే భక్తుల రాకపోకలకు కొంత విరామంగా పరమాచార్యులు వేదాంతము, తర్కము, మీమాంస, వ్యాకరణములను అభ్యసించడం జరిగింది. స్వామివారి సునిశిత ధారణాశక్తి, ఏకసంథా గ్రాహిత్యము, విషయపరిశీలనము, అన్వయములను దర్శించి పండితులు ఆశ్చర్యాతిరేకములకు లోనయ్యేవారు. మఠ నిర్వహణము, చంద్రమౌళీశ్వర సేవ కూడా కావేరీ తీరంలోని సింగం అయ్యంగారుగారి విడిది నుంచి పర్యవేక్షించడం జరిగింది. జ్ఞాన సముపార్జన – ఈశ్వరార్చన రెంటికీ తమ సమయమంతా సరిపోయేది. అంతటి అలుపెరుగని సమయంలో కూడా యువ పరమాచార్యులు కీ॥శే॥ శ్రీనివాసాచార్యుల నుండి ఫ్రెంచి భాషను అభ్యసించారు. స్వామివారు మరాఠీభాషను అభ్యసించడంలో ఒక ప్రత్యేక శ్రద్ధను చూపేవారు. మరాఠీ రచనల పట్ల వారి ఆసక్తిని గమనించి మూడు సంవత్సరాలపాటు ఒక మరాఠీ పండితుని నియమించారు మఠంలో. పరమాచార్యులు మరాఠీ గ్రంథ రచనలపై పరిశోధన చేసారనడంలో అతిశయోక్తి లేదు. వారికి దొరికిన అతి తక్కువ ఖాళీ సమయంలో కూడా తమిళ వ్యాకరణాన్ని, రచనలను అవలోకించారు. తేవారాలను, పెరియపురాణం, తిరువాచకము, తిరుక్కురల్‌ను శోధనాపూర్వకంగా అధ్యయనం చేసారు. నిజానికి వారికున్న అతితక్కువ విశ్రాంతి సమయంలో కళలను కూడా అభ్యసించడం కానీ, ఆస్వాదించడం కానీ సాధ్యమయ్యేపని కాదు. అయితే విశేష పరిజ్ఞానం కలిగిన కళాకారులతో వారు సలిపే భాషణాలలో కళలలోని ఎన్నో మెలకువలను అందిపుచ్చుకునేవారు. కళల నేపథ్యానికి వస్తే సంగీతం వారిని బాగా ఆకర్షించిన అంశం. ఈశ్వరసాన్నిధ్యాన్ని ప్రసాదించే ఒక ఉపకరణం కదా సంగీతం.

కావేరీ తీరాన ఇసుక తిన్నెలలో నడుస్తూ ప్రకృతిని ఆస్వాదిస్తుండేవారు స్వామి. ఒక్కోసారి అలా ప్రకృతి ఒడిలో ఒంటరిగా కూర్చుని ధ్యానమగ్నులయ్యేవారు. వారితో ఒక ఫొటోగ్రాఫర్ ఉంటుండేవారు. ఆస్వాదిస్తున్న ప్రకృతి దృశ్యాలను చిత్రాలుగా ఎలా మలచాలో స్వామి చెపుతుండేవారు. అంతేకాదు, ఆ రోజుల్లో 'నెగిటివ్ ఫిల్మ్' పరిజ్ఞానం కదా! స్వామి వాటిని ఎలా 'డెవలపింగ్' చేయాలో కూడా చెప్తుండేవారు. గణితము, ఖగోళము, జ్యోతిష్యములలో కూడా స్వామివారు ప్రజ్ఞ సాధించారు. ఇందుకై మతూఠ్ రామస్వామిగారు మఠంలోనే ఉండి స్వామికి బోధించే అవకాశాన్ని పొందారు. 'తేవారా'లను తాను పాడుతూ, సంగీత విద్వాంసులు వారి వద్దకు వచ్చినపుడు వారితో కలసి పాడుతూ ఎన్నో గంటలు గడిపేవారు యువస్వామి. వైష్ణవ సాంప్రదాయాలను కూడా అంకితభావంతో అధ్యయనం చేసారు స్వామి. స్వామివారి జ్ఞాన ప్రకాశానికి ప్రతీకగా మహేంద్రమంగళంలో శంకరాలయాన్ని స్థాపించడం జరిగింది.



ఒక్కసారి వారి మనోఫలకాన్ని చేరిన ఏ అంశముకూడా మరపులోనికి రావడం జరిగేది కాదు. స్వామి చెంత విషయ పరిశీలనమే కాదు – వ్యక్తి పరిశీలనములో కూడా వారికి వారే సాటి. యువస్వాముల ప్రజ్ఞా సౌగంధములో ఒక పరిమళం ఈ క్రింది సంఘటన.

భారతీయ ప్రభుత్వంచే మహామహోపాధ్యాయులుగా గుర్తించబడిన గణపతిశాస్త్రిగారు స్వామికి విద్యాకైంకర్యం చేస్తున్న రోజులవి. కుంభకోణంలోని మఠ ప్రాంగణానికి ఎదురుగా ఒక ఇంట్లో బస చేసి రోజూ మహేంద్రమంగళం చేరి స్వామివారికి గీతాభాష్యాన్ని బోధించేవారు. వారు బహుభాషా, జ్ఞాన కోవిదులు. వారికి సుమారు 40 సం॥ల వయసు. ఎన్నో వందల సంస్కృత రచనలు వారి కలం నుండి వెలువడ్డాయి. వసంతకాలంలో కావేరీ తీరంలోని ఇసుక తిన్నెలలో గణపతిశాస్త్రిగారు ఆచార్యులకు బోధ చేస్తున్నారు.

ఒకరోజు గణపతిశాస్త్రి గారి పాఠం సాగుతుండగా యువస్వాములు తమ ఎడమచేతితో ఇసుకతిన్నెలలో తడుతూ ఉండటం గమనించారు. గణపతిశాస్త్రిగారు తర్వాత రోజూ ఉదయం పరమాచార్యుల సన్నిధానాన్ని చేరి ఇలా అన్నారు "ఆచార్యస్వాములకు మమ్ము మా స్వగ్రామానికి వెళ్ళిపోవడానికి అనుమతినీయమని ప్రార్థిస్తున్నాము". "మీ ఈ ఆకస్మిక పయనానికి కారణమేమి?" అన్న యువస్వామితో కొంచెం కటువుగా ఇలా పలికారు గణపతిశాస్త్రిగారు. "విద్యను సముపార్జించే విద్యార్థి శ్రద్ధా–భక్తులతో అభ్యసించాలి. పాఠ సమయంలో మనస్సును పూర్తిగా లగ్నం చేయాలి. నిజానికి మేము విద్యను బోధించే సమయంలో ఉన్నతాసనములో కూర్చుంటాము, విద్యార్థి గౌరవభావంతో క్రింద కూర్చుంటాడు. ఆచార్యునిగా మేము శాసకత్వ భావనలో నిలుస్తాము. విద్యార్థిగా ఎప్పుడు మా ఆజ్ఞలను పాటిద్దామా అని ఎదురు చూస్తుంటారు విద్యార్థులు. ఇక్కడ ఒక సంకట స్థితి. నేర్చుకునే మీరు ఉన్నతాసనంలో కూర్చుంటారు. మేము మీకు విద్యను బోధిస్తాము. మీరు ఆజ్ఞాపూర్వకంగా శాసిస్తారు. మేము మీ ఆజ్ఞాపాలనను నిర్వర్తిస్తాము. మట్టిలో కూర్చున్నా మట్టిలో విద్యార్థి చెయ్యి – కత్తిచేతిలో ఉన్నా కత్తితో ఆడని స్థితప్రజ్ఞత విద్యార్థికి అవసరమని మా గురువుగారు ఎప్పుడూ చెప్తుండేవారు. నిన్న సాయంత్రం మా పాఠసమయంలో మీరు అశ్రద్ధతో మట్టిలో ఆడుకుంటూ కన్పించడం మాకు బాధ కలిగించింది. వెంటనే పరమాచార్యులు "నేను ఆ క్షణంలో మీకు అలా కనిపించినా నేను పూర్తి శ్రద్ధతో మీ పాఠాన్ని ఆలకిస్తున్నాను" అంటూ వారి గంటనిడివి పాఠాన్ని ఉన్నది ఉన్నట్లు అనర్గళంగా చెప్పడం జరిగింది. అంతేకాదు, గీతాభాష్యంలోని ఆ అంశానికి ఇతర తాత్త్వికులు చెప్పిన కోణాలను కూడా గణపతి శాస్త్రిగారికి యువపరమాచార్యులు విశదీకరించారు. వాటిలో కొన్ని గణపతిశాస్త్రిగారికి తెలియనివి కూడా ఉన్నాయి. ఇదంతా విన్న గణపతిశాస్త్రిగారు ఇలా అన్నారు "ఈ రోజు అవగతమయింది మీరు సాక్షాత్తూ శంకరులే



అని! శంకరభగవత్పాదులే అని! శంకరులు మరియు వారి నలుగురు శిష్యులు కలిపి పంచానన లగ్నంలో ఉద్భవించినవారని. శరణు! శరణు! మీకు నేను విద్యను బోధించనవసరం లేదు! మీ కృపకై మేము వేచి చూస్తాము" అంటూ వినమ్రులై నమస్కరించారు. – యువపరమాచార్యులకు. ఈ సంఘటన అనంతరం మరో పది నెలలు గణపతిశాస్త్రిగారు పరమాచార్యులవద్దనే ఉండి విద్యా కైంకర్యం చేసుకున్నారు.


"రుద్రయత్తే దక్షిణం ముఖం లేనె మాం పాహి నిత్యం" భగవాన్! కృపాపూర్ణమైన ముఖంతో మమ్ము సర్వదా రక్షించు – అంటూ భారతీయులు సదా చేసే ప్రార్ధనా ఫలితమే భగవత్కృప గురువుగా ఆవిర్భవించడం – ఇందుకు తార్కాణమే శ్రీచంద్రశేఖరయతీంద్రులు, శ్రీసాయినాథులు, శ్రీశరశ్చంద్రులు. వారి ఆచరణలన్నీ మనకు మార్గదర్శనం చేయడానికే కానీ, వారికి ఎటువంటి కార్యములతోనూ నిమిత్తము లేదు. వారు జ్ఞానపూర్ణులు, భూత భవిష్యత్ వర్తమాన ప్రజ్ఞాసంస్థితులు – సదా భక్తానుగ్రహస్థితులు. ఇట్టి సంఘటనలను మా మద్గురుదేవుల జీవితములోనూ దర్శించగలము.

యువపరమాచార్యుల జీవితంలో మరో సంఘటనను గుర్తు చేసుకోవడం మరింత సంతోషాన్నిస్తుంది. సుమారు 18–19 సం॥ల వయసులో స్వామివారు చాతుర్మాస్యదీక్ష చేస్తున్నారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని వాక్యార్థ విచారము, వేదాంత చర్చ జరుగుతున్నాయి మఠప్రాంగణంలో. ఎందరో పండితులు, మహామహులు, చుట్టుప్రక్కల ప్రాంతాలలోని ఎందరో శాస్త్ర పరిజ్ఞానం కలిగినవారు ఇలా అందరూ ఆసీనులయిన వేళ అది. యువ పరమాచార్యులు వారి అనుగ్రహ సన్నిధానాన్ని అందరికీ ప్రసాదించిన క్షణాలవి. అట్టి సందర్భంలో ఒకానొక అంశం ఎవ్వరికీ అర్థంకాక సంక్లిష్టంగా మారింది. మహామహోపాధ్యాయ హరిహరశాస్త్రిగారు ఆ అంశాన్ని సుమారు గంటపాటు విశదీకరించారు. ఆ ప్రసంగం మొత్తాన్ని పరమాచార్యులతోపాటు అందరూ ఎంతో శ్రద్ధతో ఆలకించారు. కానీ ఆ ప్రాంగణమంతా నిశ్శబ్దం అలముకుంది. అందరూ ఈ క్లిష్టమైన అంశాన్ని సులభశైలిలో అవగతం చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారని అవగతమైంది పరమాచార్యులకి. పరమాచార్యులు ఎంతో సులభమైన రీతిన, సంస్కృతంలో వచించి అందరి సందేహాలను పటాపంచలు చేసారు. హరిహరశాస్త్రిగారితోపాటు ఉన్న ఆహుతులందరూ యువపరమాచార్యుల జ్ఞానవైభవాన్ని దర్శించి ముగ్ధులయ్యారు. మద్గురుదేవుల జీవితంలో కూడా వారి గురుదేవులు భరద్వాజగారు యువకుడైన శరత్‌గురుదేవులను ఒక విద్వత్సభకు పంపడం – గురుదేవుల ప్రజ్ఞను దర్శించిన పెద్దలు ఆశ్చర్యాన్ని పొందడం గుర్తుకు రాకమానదు. మఠ నిర్వహణను గూర్చి ఆదుర్దా ఉన్న కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వల్ల పరమాచార్యులకు 21 సం॥లు వచ్చేవరకు 'గార్డియన్' యాక్టు అనుసరించి శ్రీవెంకటరమణ అయ్యర్‌గారిని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా



నియమించడం జరిగింది. 1915వ సం॥ శంకరజయంతి రోజున మఠ నిర్వహణ యొక్క సంపూర్ణ అధికారము పరమాచార్యులకు బదిలీ చేయడం జరిగింది. అయితే ఎన్నడునూ స్వామివారు తమ చేవ్రాలు (సంతకం) చేయడం జరుగలేదు. ఎట్టి జీతము లేకుండానే పశుపతి అయ్యర్ అనే ఒక సద్భక్తుడు, దక్షాపరాయణుడు శ్రీమఠ కార్యములన్నియు చూసుకునేవారు. 1915వ సం॥ శంకరజయంతి ఎంతో వైభవంగా జరిగింది శ్రీమఠంలో. అదే సందర్భంలో శాస్త్రము, ధర్మము సులభరీతిన, జన సామాన్య భాషలో అందరికీ చేరాలన్న సంకల్పంతో 'ఆర్యధర్మము' అనే మాసపత్రికను స్వామివారు ప్రారంభించారు. మఠ నిర్వహణలో ఎన్నో మార్పులు తెచ్చి ఫలప్రదం చేసారు ఆచార్యస్వాములు.

1916వ సం॥ నవరాత్రి ఉత్సవాలు కుంభకోణ మఠ ప్రాంగణంలోవైభవోపేతంగా సాగాయి. పరాదేవత కామాక్షికి లక్ష దీపార్చన జరిగింది. నవరాత్రులు ప్రతిరోజూ ప్రత్యేక ప్రార్ధన, పూజలు జరిగాయి. దేశమంతా సహజంగా ఉత్సవాలు జరుగుతాయి కదా! ఏమి విశేషమని తలచవచ్చు పాఠకులు. అయితే ఆనాటి పత్రికలన్నీ తమ పతాక శీర్షికలలో మరియు వాణిజ్య పత్రికలలో ఎక్కువభాగాన్ని ధర్మము, భక్తి, శాస్త్రము, ఆచరణ వంటి ప్రతీ అంశాన్ని విశ్లేషణాత్మకంగా వివరించిన తీరూ పరమాచార్యుల ఆశయాలను, ప్రజాబాహుళ్యంలో వారు భగవద్విశ్వాసాలను పాదుకొల్పాలన్న ఆకాంక్షను ప్రతిబింబించారు. విద్వత్ సభలతో మఠ ప్రాంగణం జ్ఞానశోభను సంతరించుకుంది. సరస్వతికి ప్రీతి పాత్రమైన వీణానాదంతో ప్రాంగణం పావనమయింది. సరస్వతీ పూజామహోత్సవ పర్వదినాన ప్రఖ్యాత సంగీత విద్వాంసుల కచేరీలతో పరమాచార్యుల అనుగ్రహదర్శనంతో ప్రజల ఆనందాతిరేకాలు మిన్నంటాయి. నవరాత్రులకు నెలరోజుల ముందునుండే నగరంలోని వర్తకులంతా ఏర్పాట్లలో మునిగితేలారు. విజయదశమి పర్వదినాన పరమాచార్యులు కుంభకోణంలోని అన్ని దేవాలయాలలోని అర్చామూర్తులను దర్శించి, పూజించారు. ఆనాటి రాత్రి స్వామివారు అంబారీపై ఆసీనులై, పురవీధులలో దర్శనమిచ్చారు. వేదపారాయణ, భజన బృందాలు, తేవారము పాడుతూ సాగే బృందాలు, బాణాసంచా పేలుళ్ళు, దీపకాంతుల వెలుగులు, ఏనుగులు, ఆటలాడే గుర్రాలు, ఇలా వర్ణనకు అందని సంబరంగా పరమాచార్యుల దర్శనం లభించింది– పురవాసులకు, అంతేవాసులకు. శ్రీసాయి పల్లకీఉత్సవము, శ్రీబాబూజీ దర్శనమహోత్సవము కళ్లముందు కదులుతున్నాయి. గురువైభవాన్ని ఎంతని చెప్పుకుంటే జిహ్వకు తృప్తి? ఎన్ని కవితలు, కావ్యాలు వ్రాస్తే సంతృప్తి? గురుని వైభవం తెలియాలంటే గురుని భావం తెలియాలి. గురునిపట్ల అనురాగం కలగాలి. గురునికీర్తి 'రాగ'మవ్వాలి! సర్వులకు సద్గురుచరణ ప్రాప్తిరస్తు! గురుచరణ తీర్థ ప్రాప్తిరస్తు! శుభం భవతు!



# సాయి సీకర్స్

SAI SEEKERS

మనం అందరం కూడాను బాబా యొక్క అనుగ్రహం కోసముగా సీక్ చేసేవాళ్ళము కనుక "Sai Seekers" అని పెట్టుకోండయ్యా అని చెప్పాను. నాకు బాబా కావాలి. అందుకు we seek Baba and when we seek of Baba seek from Baba ఆయన అనుగ్రహం కావాలి, ఆయన రక్షణా కావాలి, బాబానూ కావాలి. ఇట్లా తీసుకున్నా సాయిసీకర్సే, అట్లా తీసుకున్నా సాయిసీకర్సే.

బాబాను Seek చేస్తే ఏమవుతుంది? బాబాను చూడటమే మనకు కావల్సింది. ఏంది మనం బాబాను గురించి అడిగేది? ఆయన దర్శనమే. ఆయన దర్శనం అయినపుడు, అందుకని ఆ SEE అనేటువంటిది highlight చేసాను. కానీ ఎక్కడ చూస్తాం ఆయన్ని, మనం బాబాని? మనలో మనమే చూసుకుంటాం. ఎక్కడో బయట కనిపించరు ఆయన. అద్దంలో మనల్ని మనం చూసుకున్నట్లుగానే ఆత్మదర్శనం కావాలి. అందుకని ఒక అద్దంలాగా, ఒక ఎఫెక్ట్ ఇచ్చాను దాంట్లో. ఎక్కడ చూస్తావు నువ్వు అనంటే అద్దంలో నిన్ను నీవు చూసుకుంటావు. అక్కడ ఆత్మదర్శనమే అవుతుంది. అందుకని దానికి ఆ 'లోగో'ను అలా చేసిచ్చాను. దాంట్లో ఉండే అర్థం అది. బాబాను Seek చేస్తే, ఆయన గురించి మనం ప్రార్థన చేస్తే, ఆయన దర్శనం కావాలనుకుంటాం. దర్శనం ఇస్తారు.

ఆ దర్శనం ఎక్కడ అవుతుంది? అది ఆత్మదర్శనమే! అది అద్దంలో మనల్ని మనం చూసుకునేటటువంటిది. కాబట్టి మేము దేనికి Seek చేస్తున్నాం అంటే ఆత్మదర్శనానికే Seek చేస్తున్నాం. మనకు 'సాయి'యే ఆత్మ, ఆయనే పరమాత్మ. వీటన్నిటికి పోము కనుక మనం సాయి సీకర్స్‌మి. మనం భక్తులమో కాదో అది బాబా చెప్పాలి. మేము మాత్రం ఆయన్ని Seek చేస్తాం అంతవరకే. ఎవరికి వాళ్ళం మనం భక్తులమనుకుంటే ఎట్లా? ఆయన కదా చెప్పాలి మనం భక్తులమో,

కాదో. మాకు తెలియదు స్వామి, మీరు మాత్రం మాకు కావాలి. మమ్మల్ని భక్తులంటావో, ఇంకోటంటావో అది మీ ఇష్టం. అది సాయిసీకర్స్ అంటే.

ఎప్పటికప్పుడు ఆత్మదర్శనం అయ్యే లోపల కూడా మనం అద్దంలో చూసుకోవటం లాంటిదే.. మనం ఎలా పోతున్నాం? సత్సంగానికి పోతామనుకుంటున్నాం. మనం సాయిభక్తుల మనుకుంటున్నాం. నిజంగా మనం సాయిభక్తులమా? మనలో ఉండేటటువంటి ఏమేమి గుణాలు ఉన్నాయి? బాబాను మనకు దూరం చేసేటటువంటి గుణాలు ఏమున్నాయి? మనం సత్సంగానికి పోయినపుడు మనం బాబానే seek చేస్తున్నామా? లేకపోతే ఇంకా వేరే వాటిని కూడా seek చేసుకుంటున్నామా? సాయిని కాకుండా! recognition (గుర్తింపు). నా పాట వినాలి, నా గొంతు వినాలి, నా స్పీచ్ వినాలి! నన్నందరూ లీడర్ కింద గుర్తించాలి, నా మాట అందరూ వినాలి అనేటటువంటి power seeking ఉందా? name seeking ఉందా?

ఏం seekings ఉన్నాయి మనలో? ఈ seekings ఏవీ కాకుండా ఒక్క బాబాను మాత్రమే seek చేస్తున్నామా అని మనల్ని మనం ఎప్పటికప్పుడు అద్దంలో చూసుకుంటూ ఉండాలి. చూసుకుంటూ, చూసుకుంటే మనం ఎంత uglyగా ఉన్నామో కనిపిస్తుంది. ఆ uglyని తుడుచుకుంటూ, తుడుచుకుంటూ, తుడుచుకుంటూ పోతే అంతా పోయేటప్పటికి అక్కడ బాబా కనిపిస్తారు. కాబట్టి ఆ రకంగా చూసుకున్నా కూడా అది SEE యే. అద్దంలో చూసుకున్నట్లే! అట్లా అనుక్షణం ప్రతిరోజూ, ప్రతి సత్సంగంలోనూ, ప్రతి సత్సంగం బయటా ఎప్పటికప్పుడు మనం ఆత్మ దర్శనం చేసుకుంటూనే ఉండాలి. ఆ ఆత్మదర్శనం తగ్గిందంటే ఈ మిగతా seekings పెరుగుతాయి, సాయి seeking కాకుండా! ఆ తరువాత అది వేరే రకంగా అవుతుంది. ఈ సత్సంగాలు వేరే వేరే దానికి వేదికలవుతాయి! అలా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే! – *శ్రీబాబూజీ*

